
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

5



శ్రీ పొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లా వార్తలు

సోమవారం 5 ఆగస్టు 2024

● నెల్లూరు నగరం దర్గామిట్టకు చెందిన భవన నిర్మాణ కార్మికుడు వేణు దగ్గు, జ్వరంతో ఓ ప్రైవేటు ఆసుపత్రికి వెళ్లారు. రక్తంలో ప్లేట్లెట్‌ల కౌంట్, మలేరియా పరీక్షలు చేయించుకోవాలని సదరు వైద్యుడు సూచించడంతో రూ.2వేలు ఖర్చు చేయాల్సి వచ్చింది. తీరా పరీక్షలలో సాధారణ జ్వరంగా నిర్ధారణ అయింది. ఇలా అవసరం లేకపోయినా రక్త పరీక్షలు పేరుతో కొందరు వైద్యులు ప్రజలను నిలువు దోపిడీ చేస్తున్నారు.

● ఇందుకూరుపేటకు చెందిన సన్నకారు రైతు సుబ్రహ్మణ్యంకు తరచూ జలుబు చేస్తుండటంతో నెల్లూరులోని ఓ కార్పొరేట్ ఆసుపత్రిలో వైద్యుడ్ని కలిశారు. లివర్‌కు సంబంధించి సిరప్ పరీక్ష చేయించుకోమని ఆసుపత్రికి అనుబంధంగా ఉన్న ల్యాబ్‌కు సిఫారసు చేశారు. పరీక్ష తర్వాత లివర్‌లో ఏ సమస్య లేదని నిర్ధారణ అయింది. అయితే, ఆ పరీక్షకు మాత్రం రూ. 3 వేలు వసూలు చేశారు.

- నెల్లూరు(వైద్యం)



జలగే నయం!

వివిధ రకాల పరీక్షల పేరుతో దోపిడీ

అవసరం లేకపోయినా చేయించుకోవాల్సిందే!

ల్యాబ్‌ల్లో ఇష్టానుసారంగా పిండుడే పిండుడు!

నిబంధనలకు నీళ్లొదిలి వసూలు

ప్రతినెలా రూ.8.5 కోట్ల వ్యాపారం

వచ్చే రాబడిలో వైద్యులకు కమీషన్

హడావుడి తప్ప వైద్య శాఖ చర్యలు శూన్యం

జ్వరం వస్తే రక్త పరీక్షలు.. కడుపునొప్పి అంటే చాలు మలం పరీక్షలు.. దగ్గు వస్తోందంటే ఉమ్మి పరీక్ష, ఎక్స్‌రే.. ఆయాసం అంటే ఈసీజీ స్కానింగ్.. తలనొప్పిగా ఉందంటే సిటీస్కాన్.. పొట్ట ఉబ్బరంగా ఉందంటే ఎండోస్కోపీ. ఇలా పరీక్షలు లేనిదే వైద్యులు రోగ నిర్ధారణ చేసే పరిస్థితి లేదు. రోగి నాడీ పట్టి రోగం ఏమిటో ఇట్టే చెప్పే వైద్యులు ఉన్నా ల్యాబ్‌లో పరీక్షలు, రిపోర్టులను పరిశీలించనిదే వైద్యం అందించడంలేదు. వైద్యులకు అందించే ఫీజుల కన్నా ఈ ల్యాబ్ పరీక్షలకే ఎక్కువ ఖర్చు అవుతోంది. ఇందులో కమీషన్ పేరిట వైద్యులు భారీ మొత్తాలను ఆశిస్తుండటంతో ఆయా ల్యాబ్ నిర్వాహకులు కూడా వైద్యులతో ఒప్పందాలు కుదుర్చుకుని రోగుల రక్తాన్ని పీల్చేస్తున్నారు. ప్రభుత్వ ఆసుపత్రులలో సరైన వైద్యం అందకపోవడంతో దీన్ని అవకాశంగా తీసుకున్న కొందరు వైద్యులు ఈ రకం దోపిడీకి పాల్పడుతున్నారు. ప్రభుత్వ అనుమతులు ఉన్న కేంద్రాలు పదుల సంఖ్యలో ఉండగా, అనుమతి లేనివి వెయ్యికిపైగా ఉన్నట్లు పలు పరిశీలనలో వెల్లడయ్యాయి.

● నెలకు 8.50 కోట్ల వ్యాపారం

జిల్లావ్యాప్తంగా 600లకుపైగా రక్త పరీక్షలు నిర్వహించే ల్యాబ్‌లు ఉన్నాయి. ఇందులో వంద వరకు కార్పొరేట్ ఆసుపత్రులకు అనుబంధంగా ఉన్నాయి. వీటిలో ఒక్కో ల్యాబ్‌లో వివిధ రకాల పరీక్షల పేరుతో రోజూ రూ.20వేల నుంచి 30 వేల వసూలు చేస్తుంటారు. 300 ల్యాబ్‌లలో ఒక్కో దానిలో రోజుకు రూ.4వేల నుంచి ఐదు వేల వరకు, మరో 200 ల్యాబ్‌లలో రోజుకు 500 నుంచి రూ.వెయ్యి వరకు పరీక్షల పేరిట వసూలు చేస్తున్నారు. ఈ లెక్కన ప్రతి నెల రూ. 8.50 కోట్లకుపైగా రోగుల నుంచి వసూలు చేస్తున్నారు. ఒక్క నెల్లూరు నగరంలోనే 300లకుపైగా రక్తపరీక్షా కేంద్రాలు ఉండ గా, వీటిలో 80 శాతం ఆసుపత్రులకు అనుబంధంగా ఉన్నవే. వివిధ పరీక్షల పేరుతో వైద్యులకు పర్సంటేజీల రూపం లో అందే మొత్తం భారీగానే ఉంటోంది. అవసరం లేకపోయినా హిమోగ్లోబిన్, కొలస్ట్రాల్, షుగర్, కిడ్నీ సంబంధించి బ్లడ్ యూరియాతోపాటు హెచ్‌ఐవీ పరీక్షలు చేయించుకోవాలని సూచిస్తున్నారు. మరోవైపు ల్యాబ్‌లలో టెక్నీషియన్ కోర్సులు పూర్తి చేసిన వారే రక్తపరీక్షలు చేయాలి. ఇందులో అనుభవం ఉన్న వారు పెద్దస్థాయి పరీక్షలు చేయాలి. అయితే ఎటువంటి కోర్సు పూర్తి చేయని వారు కూడా కొంత అనుభవంతో పరీక్షలు చేస్తున్నారు. ఈ పరీక్షల ఫలితాలలో అనేక పొరపాట్లు నమోదవుతున్నాయి. ఈ రిపోర్టుల ఫలితాలతో వైద్యులు చికిత్స చేస్తుండడంతో మరో వ్యాధికి గురి కావాల్సి వస్తోంది.

● ప్రభుత్వ అనుమతులు కొన్నే..

రక్తపరీక్ష కేంద్రాలకు సంబంధించి ప్రభుత్వ అనుమతులు తప్పనిసరిగా తీసుకోవాలి. అయితే జిల్లాలో ఈ కేంద్రాలకు అనుమతులు మాత్రం వంద సంఖ్యలోనే ఉన్నాయి. జిల్లావ్యాప్తంగా 600లకు పైగా కేంద్రాలు ఉన్నాయి. వీటిలో కేవలం 178కి మాత్రమే అనుమతులు ఉన్నట్లు వైద్య ఆరోగ్య శాఖ వెల్లడిస్తోంది. నెల్లూరు నగరంతోపాటు కావలి, ఆత్మకూరు, కందుకూరు పట్టణాలలో వీధి వీధిన పుట్టగొడుగుల్లా పరీక్ష కేంద్రాలు ఉన్నాయి. ఎప్పుడో గుర్తు వచ్చినప్పుడు మాత్రమే వైద్య ఆరోగ్య శాఖ అధికారులు బృందాలుగా ఏర్పడి దాడులు నిర్వహించి హెచ్చరికలతో వదిలేస్తుండటంతో పరిస్థితి యథావిధిగా మారుతోంది.

రోగనిర్ధారణ పరీక్షల ఫీజుల వివరాలు (రూ.లలో)		
పరీక్ష	చేయాల్సినది	చేస్తున్నది
హిమోగ్లోబిన్	45 నుంచి 100	200 నుంచి 300
హెచ్‌ఐవీ	100 - 150	250 - 300
హెచ్‌బీఎస్	50 - 75	150 - 250
యూరియా	45 - 80	150 - 200
షుగర్	50 - 75	250 - 300
సిరం క్రియేటిన్	40 - 70	200 - 250
పాస్ఫేట్	75 - 100	300 - 470
యూరిన్	50 - 75	150 - 230
డెంగ్యూ	250 - 300	800 - 2600
ప్లేట్లెట్	150 - 200	500 - 700
మలేరియా	100 - 150	300 - 350

నిబంధనలు ఇవీ..

- రక్తపరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేయాలంటే తప్పనిసరిగా వైద్య ఆరోగ్య శాఖ అనుమతి తీసుకోవాలి.
- ఆయా కేంద్రాలలో ఎలాంటి పరీక్షలు నిర్వహిస్తారో రాతపూర్వకంగా తెలియజేయాలి. అలాగే ఏ ఏ పరీక్షలు నిర్వహిస్తున్నారో బోర్డులు కూడా ఏర్పాటు చేయాలి.
- ఏయే పరీక్షలకు ఎంత వసూలు చేస్తారో కూడా తెలియజేయాలి.
- అర్హులైన పారామెడికల్ శిక్షణ పూర్తి చేసుకున్న వారే ఈ పరీక్షలు నిర్వహించాలి.
- ప్రతి ఐదేళ్లకోసారి తప్పనిసరిగా రిజిస్ట్రేషన్ పునరుద్ధరించుకోవాలి.



తనిఖీలు ముమ్మరం చేస్తాం



జిల్లాలోని ల్యాబోరేటరీలను ముమ్మరంగా తనిఖీ చేస్తాం. ఇప్పటికే కొన్ని ల్యాబ్‌లపై ఆరోపణలు వచ్చాయి. రక్తపరీక్ష కేంద్రాలు తప్పనిసరిగా వైద్య ఆరోగ్య శాఖలో రిజిస్ట్రేషన్ చేసుకోవాలి. అలా చేసుకోని వారిపై తీవ్ర చర్యలుంటాయి. ఎప్పటికప్పుడు బృందాలుగా ఏర్పడి కేంద్రాలపై దాడులు నిర్వహించి, చర్యలు తీసుకుంటున్నాము. కేసులు నమోదు చేస్తున్నాము.

- డాక్టర్ పెంచలయ్య, డీఎంహెచ్‌వో

• నేటి నుంచి శ్రావణమాసం

• వ్రతాలు, నోములకు ప్రత్యేకం

• పెళ్లిళ్లకు ఎంతో ప్రాధాన్యం



ముహూర్తం వచ్చేసింది!

నెల్లూరు (సాంస్కృతికం)/ పొదలకూరు, ఆగస్టు 4 : తెలుగు నెలల్లో ఐదవది శ్రావణమాసం. సోమవారం నుంచి ఈ మాసం ప్రారంభం కానున్నది. ఈ నెలను తెలుగువారు ఎంతో పవిత్రంగా భావించి వివిధ నోములు, వ్రతాలు ఆచరించడంతోపాటు వివాహాలు కూడా చేసుకుంటారు. అంతేకాక సౌభాగ్యాన్ని ప్రసాదించే మాసంగా మహిళలు భావిస్తారు. శ్రావణశుక్రవారాల్లో లక్ష్మీదేవికి లక్ష కుంకుమార్చనలు చేస్తారు. రెండో శుక్రవారం నాడు వరలక్ష్మీ వ్రతం నిర్వహించనున్నారు. శుక్ల చవితిరోజు నాగచతుర్థిని, శుక్ల ఏకాదశిని, పుత్రఏకాదశిగా జరుపుకుంటారు. శ్రావణ పౌర్ణమిని రాఖీపౌర్ణమిగా నిర్వహిస్తూ అన్నాచెల్లెళ్లు రాఖీలు కట్టుకుంటారు. కృష్ణపక్ష అష్టమిని శ్రీకృష్ణాష్టమిగా జరుపుకుంటారు. శ్రావణ మాసం (ఆగస్టు)లో 5, 6, 7, 8, 10, 11, 12, 13, 16, 17,20, 21వ తేదీల్లో వివాహ ముహూర్తాలు అధికంగా ఉన్నాయి. ఈనెలలో వివాహ ముహూర్తాలు కుదరకపోతే నాలుగు నెలల తర్వాతే మంచి ముహూర్తాలు ఉన్నాయి. ఆగస్టు 6వతేదీ రాత్రి ముహూర్తానికి వేలాది వివాహాలు జరగున్నాయి.



● మోగనున్న పెళ్లి బాజాలు!

శ్రావణమాసం ప్రారంభం కావడంతో పల్లెలు, పట్టణాల్లో పెళ్లిబాజాలు మోగనున్నాయి. మూడునెలల తర్వాత పొదలకూరు మండలంతోపాటు జిల్లాలో భారీగా పెళ్లిళ్లు జరగనున్నాయి. ప్రస్తుత ముహూర్తాల్లోనే గృహ ప్రవేశాలు, భూమి పూజలు, ఉపనయనాలు, బారసాల వంటివి జరగనున్నాయి. ఎంతో మందికి ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధి చూపేది వివాహ వేడుకలే.

ఉద్యాన రైతులకు ఊరట

● బిందు, తుంపర్ల సేద్యం యూనిట్ల కేటాయింపు

● రూ.76.57కోట్లతో 10,500హెక్టార్లలో అమలు లక్ష్యం

నెల్లూరు(వ్యవసాయం), ఆగస్టు 4 : ఉద్యాన రైతులను కూటమి ప్రభుత్వం ప్రోత్సహిస్తోంది. సూక్ష్మసేద్యా నికి పూర్వ వైభవం తీసుకొచ్చేలా ప్రణాళికలు రూపొందిస్తున్నది. 45 నుంచి 90 శాతం వరకు రాయితీపై అవసరమైన పరికరాలను అందజేయనున్నది. ఈ క్రమంలో జిల్లా నీటి యాజమాన్య సంస్థ, ఉద్యానశాఖలు సమన్వయం చేసుకుంటూ ప్రగతిని సాధించాలని జిల్లా కలెక్టర్ ఓ. ఆనంద్ ఆదేశాలు జారీ చేశారు.

● కూటమి ప్రభుత్వంతో కదలిక

గత ప్రభుత్వం ఉద్యాన రైతులకు తీవ్ర నిరాశను మిగిల్చింది. బిందు, తుంపర్ల సేద్యం పరికరాలకు తూట్లు పొడిచింది. వీటి సరఫరా సంస్థలకు బకాయిల చెల్లించకపోవడంతో ఆయా సంస్థలు పరికరాలను అందించేందుకు ముందుకు రాలేదు. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో ఉద్యాన రైతులకు అండగా నిలిచేలా ప్రణాళికలు రూపొందించింది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆధ్వర్యంలో రాయితీ, రైతువాటాతో సూక్ష్మసేద్యా నికి పరికరాలను అందించే ప్రక్రియ ప్రారంభమైంది. స్థానిక రైతుసేవాకేంద్రాల్లో బిందు, తుంపర్ల సేద్యానికి సంబంధించిన పరికరాల కోసం ఉద్యాన రైతులు దరఖాస్తు చేసుకోవాలని పిలుపునిచ్చింది.

ఆర్‌ఎస్‌కేలో నమోదు చేసుకోండి



జిల్లాలో రూ.76.57కోట్లతో 10,500 హెక్టార్లలో బిందు, తుంపర్ల సేద్య పరికరాల పథకం అమలుకు లక్ష్యాలను నిర్దేశించారు. రాయితీని పొందేందుకు రైతులు ఆధార్‌కార్డు, భూమి యాజమాన్య పత్రం జతచేసి సమీపంలోని రైతు సేవా కేంద్రం(ఆర్‌ఎస్‌కే)లో ఉన్న వీఏఏ, వీహెచ్‌ఏ, వీఎస్‌ఏలను సంప్రదించి బయోమెట్రిక్ ద్వారా నమోదు చేసుకోవాలి. ఇంకా ఏదైనా అనుమానాలుంటే 0861-231 5779 నెంబరును సంప్రదించాలి.

- శ్రీనివాసులు, పీడీ, ఏపీఎంఐపీ

● బకాయిల చెల్లింపునకు పచ్చజెండా

2022-23లో జిల్లాలో 2,600 హెక్టార్లలో బిందు, తుంపర్ల సేద్యం లక్ష్యం కాగా, అధికారులు 3424.74 హెక్టార్లకుగాను రూ.25.07కోట్ల విలువైన పరికరాలను అమర్చారు. అప్పటి ప్రభుత్వం కేవలం రూ.4.17కోట్లు మాత్రమే చెల్లింపులు చేసింది. రూ.20.9కోట్ల మేర బకాయిలున్నాయి. అలాగే 2023-24లో 3500 హెక్టార్లు లక్ష్యం కాగా, 2654.26 హెక్టార్లకు సంబంధించి రూ.19.9కోట్ల మేర పరికరా లను అమర్చారు. అయితే ఒక్క రూపాయి కూడా చెల్లించలేదు. కూటమి ప్రభుత్వం రాగానే 2022-23కి సంబంధించిన బకాయిల్లో దాదాపు రూ.13.04కోట్ల చెల్లింపులకు పచ్చజెండా ఊపింది. రాయితీ నగదును నేరుగా రైతుల ఖాతాల్లో జమ చేయనున్నది.

బిందు సేద్యానికి సంబంధించి హెడ్ యూనిట్‌ను పరిశీలిస్తున్న అధికారులు(ఫైల్)



● 10,500 హెక్టార్లలో బిందు, తుంపర్ల సేద్యం

2024-25 సంవత్సరానికి ఉద్యాన పంటల అభివృద్ధికి 10,500 హెక్టార్లలో పథకం అమలుకు జిల్లా కలెక్టర్ ఓ. ఆనంద్ ఆదేశాలు జారీ చేశారు. జిల్లాలో ముఖ్యంగా నిమ్మ, మామిడి, బత్తాయి, జామ, బొప్పాయి, మిరప, పచ్చలతోపాటు కూరగాయలు, పూలమొక్కల సాగుకు బిందు సేద్య పరికరాలు అందించనున్నారు. అలాగే మినుము, వేరుశనగ, పెసర తదితర పంటలకు తుంపర్ల సేద్య పరికరాలను రైతులకు రాయితీపై అందించేందుకు ప్రణాళికలు రూపొందించారు. ఐదుఎకరాల వరకు భూమి ఉన్న చిన్న, సన్నకారు రైతులకు 90శాతం బిందు సేద్యం, 55శాతం తుంపర్ల సేద్య పరికరాలు, 5 నుంచి 10 ఎకరాల వరకు భూమి ఉన్న రైతులకు 70శాతం బిందు సేద్యం, 45శాతం రాయితీపై తుంపర్ల సేద్య పరికరాలు అందించనున్నారు.

ఎక్సైజ్‌లో సెబ్ విలీనం ?

● కొత్త మద్యం పాలసీ దిశగా ప్రభుత్వం అడుగులు

● పొరుగు రాష్ట్రాల్లో పరిశీలన

● అక్టోబరు ఒకటి నుంచి అమలు

నెల్లూరు,(క్రైం),ఆగస్టు 4: రాష్ట్రంలో ఎన్డీఏ కూటమి ప్రభుత్వం ఏర్పడి నెలన్నర పూర్తయింది. గతంలో ఉన్న మద్యం బ్రాండ్లు ఇంకా దుకాణాల్లోకి రాలేదే..? ఇంకా ఎన్నాళ్లు ఇలా క్యూలో నిల్చొని మద్యం కొనుగోలు చేయాలి... మద్యం కోసం రూ. వేలకు వేలకు ఇంకా ఎంతకాలం బార్లకు చెల్లించాలి.. ? అనే ఆవేదనలో మందుబాబులు ఉన్నారు. రాష్ట్ర ప్రభుత్వం నూతన మద్యం పాలసీని తీసుకు వస్తుందా..? ఇప్పుడున్న పాలసీనే కొనసాగుతుందా...? అన్న అనుమానాలు కూడా వారిలో వ్యక్తమవుతున్నాయి. ఈ క్రమంలో రాష్ట్ర ప్రభుత్వం నూతన పాలసీ వైపు వేగంగా అడుగులు వేస్తున్నది. అక్టోబరు ఒకటి నుంచి కొత్త మద్యం పాలసీ అమలుల్లోకి తీసుకువచ్చేందుకు ప్రయత్నిస్తున్నది.



● ఇతర రాష్ట్రాల్లో పరిశీలన

నూతన మద్యం పాలసీని రూపొందించే క్రమంలో రాష్ట్ర ప్రభుత్వం 12 మందితో ప్రత్యేక కమిటీలను ఏర్పాటు చేసిం ది. రాజస్థాన్‌కి ముగ్గురు, ఉత్తరప్రదేశ్‌కి ముగ్గురు, కర్ణాటక, తెలంగాణ రాష్ట్రా లకు ముగ్గురు, తమిళనాడు, కేరళ రాష్ట్రాలకు ముగ్గురు చొప్పున అధికారులను కేటాయించింది. ప్రతీ కమిటీలోనూ డిప్యూటీ కమిషనర్ స్థాయి అధికారిని ఒకరు ఉంటారు. రెండు రోజుల్లో ఈ కమిటీలు వారికి కేటాయించిన రాష్ట్రాలకు వెళ్లి అక్కడున్న మద్యం పాలసీలను పరిశీలిస్తారు. లోటుపాట్లను తెలుసుకొని ప్రభుత్వానికి నివేదిక ఇవ్వనున్నారు. ఈ నేపథ్యంలో ఎక్సైజ్, ఎన్‌ఫోర్స్‌మెంట్ నుంచి వేరుచేసిన సెబ్‌ను తిరిగి ఎక్సైజ్‌లో విలీనం చేస్తారా... లేదా అనే అంశంపై మరో 19 మందితో కమిటీని నియమించింది. మందుబాబులకు మంచి బ్రాండ్ల మద్యం, మద్యం కోసం ఇబ్బందులు పడకుండా చూడడంతోపాటు ప్రభుత్వానికి మద్యం అమ్మకాల ద్వారా వచ్చే రెవెన్యూను సైతం దృష్టిలో ఉంచుకొని కమిటీలు ప్రణాళికలను సిద్ధం చేయనున్నాయి.

● అక్టోబరు నుంచి అమలు

అక్టోబరు ఒకటి నుంచి నూతన మద్యం పాలసీ అమలులోకి రానున్నది. ఇందులో భాగంగా ప్రభుత్వ మద్యం దుకా ణాలను తొలగించి, గతంలోలా వైన్‌షాపులు ఏర్పాటు చేసేలా ప్రభుత్వం చర్యలు తీసుకోనున్నది. ఈ క్రమంలో కార్పొరేషన్, మున్సిపాలిటీ, పంచాయతీల్లో వైన్ షాపుల టెండర్ల ప్రక్రియ ఎలా ఉంటుందన్న సందేహాలు అందరిలోనూ ఉన్నాయి. లక్కీడిప్ ద్వారా దుకాణాలను కేటాయిస్తారా...? టెండర్ల ప్రక్రియను బార్లకు నిర్వహించినట్లు ఆన్‌లైన్‌లో వైన్‌షాపులకు కూడా నిర్వహిస్తారా...? ఇలా అనుమానాలు వ్యాపారుల్లో ఉన్నాయి. గతంలో వైన్ షాపులు నిర్వహించే వారంతా ప్రస్తుతం నూతన పాలసీ కోసం వేయికళ్లతో ఎదురుచూస్తున్నారు. ఏది ఏమైనా ఈ నెలాఖరుకల్లా మద్యం పాలసీపై ఓ స్పష్టత వస్తుందని అంతా భావిస్తున్నారు.

ముంపు పేరుతో దోపిడీ

నెల్లూరు, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): డబ్బు రుచి మరిగిన దళారులు తెలుగుగంగ ప్రాజెక్టు (టీజీపీ)ను వదిలి పోవడం లేదు. కండలేరు ముంపు భూముల పేరిట జరుగుతున్న దోపిడీని గతేడాది 'ఆంధ్రజ్యోతి' బట్టబయలు చేసింది. ఈ క్రమంలో అప్పటి జేసీ విచారణ కూడా జరిపి రూ.కోట్ల అక్రమాలు జరిగాయని నిర్ధారించారు. దీంతో అప్పటి నుంచి టీజీపీ భూసేకరణ కార్యాలయాల వైపు దళారులు రావడం మానేశారు. అయితే మళ్లీ ఇప్పుడు వారు ప్రజాధనం కొల్లగొట్టేందుకు స్కెచ్ వేస్తున్నారు. గత కొన్ని రోజులుగా ఇటు జిల్లా కేంద్రంలోనూ, అటు రాష్ట్ర రాజధానిలోనూ, అధికారుల ను బుట్టలో వేసుకునేందుకు తీవ్రంగా ప్రయత్నాలు చేస్తున్నారు. కొన్ని భూముల పరిహారాలకు సంబంధించి దస్త్రాలు జిల్లాలో కదులుతున్నాయి.

● భారీగా ప్రణాళికలు

కండలేరు ముంపు గ్రామాల్లోని సీజేఎఫ్ఎస్, డీకేటీ భూముల పేరిట రూ.వందల కోట్ల పరిహారం కొట్టేసేం దుకు భారీ ప్రణాళికలు రూపొందుతున్నాయి. గత 32 ఏళ్ల క్రితం కండలేరు ప్రాజెక్టుకు ఈ భూములను తీసుకోగా, ఇప్పుడు ఆ భూములకు పరిహారం కావాలంటూ కొంతమంది నుంచి అర్జీలు అందుతున్నాయి. వీటిని ఇద్దరు బ్రోకర్లు అధికా రులకు అందజేస్తూ మేనేజ్ చేస్తున్నారు. 1992లో తీసుకున్న భూములకు ఇప్పుడు 2013 భూసేకరణ చట్టం ప్రకారం పరిహారం చెల్లించాలంటూ పావులు కదుపుతున్నారు. ఇది చట్ట విరుద్ధమని తెలిసినా టీజీపీ రాపూరు యూనిట్ అధికారులు కొత్త రిక్విజిషన్ పంపాలంటూ ఇరిగేషన్ అధికారులకు లేఖ రాయడం చర్చనీయాంశ మైంది. 2013 భూసేకరణ చట్టం అమల్లోకి రాకముందు వరకూ సీజేఎఫ్ఎస్, డీకేటీ భూములకు ప్రభుత్వం నిర్దిష్ట పరిహారం చెల్లించేది కాదు. అప్పటి పరిస్థితులకు అనుగుణంగా రైతులకు పరిహారం చెల్లిస్తూ వచ్చింది. 2013 నుంచి పట్టా భూములతో సమానంగా పరిహారం చెల్లిస్తున్నారు. అయితే కండలేరు ముంపు గ్రామాల్లో వందల ఎకరాల సీజేఎఫ్ఎస్, డీకేటీ భూములున్నాయి. ఈ భూములను కండలేరు ప్రాజెక్టుకు తీసుకుంటూ 1992 నుంచి 2013 వరకు పలు దఫాలుగా అప్పటి ఇరిగేషన్ అధికారులు రిక్విజిషన్ పంపడం, దాన్ని ప్రభుత్వం ఆమోదించ డం జరిగింది. ఇప్పుడు ఆ భూములకు కొత్త చట్టం ప్రకారం పట్టా భూములతో సమానంగా పరిహారం చెల్లించేందుకు కుట్రలు జరుగుతున్నాయి. రాపూరు మండలం గుండవోలు నుంచి తొలుత 30 ఎకరాలకు సంబంధించి అర్జీలు పెట్టి వాటికి తొలుత ఫ్రెష్ రిక్విజిషన్ తెచ్చేందుకు తెరవెనుక ప్రయత్నాలు జరుగుతున్నాయి. ఆ వెంటనే మరో 120 ఎకరాలకు ఇదే మాదిరిగా పెట్టేందుకు సన్నాహాలు జరుగు తున్నట్లు తెలుస్తోంది. రెండేళ్ల క్రితం కూడా ఇదే మాదిరిగా అర్జీలు వచ్చినప్పటికీ.. ఎప్పుడో 1992లో ఇచ్చిన రిక్విజిషన్‌కు మళ్లీ కొత్తగా రిక్విజిషన్ ఇవ్వడం సాధ్యపడదని అప్పటి ఇరిగేషన్ అధికా రులు స్పష్టం చేశారు. కొత్తగా భూములు ముంపునకు గురవుతు న్నాయని అర్జీలు అందితే.. తొలుత భూసేకరణ విభాగం అధికారులు ఆ భూములను గతంలో రిక్విజిషన్ కింద తీసుకుని ఉన్నారా..? లేదా..? అన్నది పరిశీలిస్తే తేలిపోతుంది. అది పక్కన పెట్టి ఎప్పుడో కండలేరుకు తీసుకున్న భూములకు ఇప్పుడు కొత్తగా రిక్విజిషన్ పంపాలంటూ ఇరిగేషన్ అధికారులకు లేఖ రాయడం పలు అనుమానాలకు తావిస్తోంది.



నెల్లూరులోని తెలుగుగంగ ప్రాజెక్టు డిప్యూటీ కలెక్టరు కార్యాలయం

● టీజీపీలో మళ్లీ మొదలైన దళారుల హవా

● పరిహారం కోసం దొడ్డిదారిన కదులుతున్న ఫైళ్లు

● 32 ఏళ్ల క్రితం ఇచ్చిన భూములకు ఇప్పుడు పరిహారమట !

● సీజేఎఫ్ఎస్, డీకేటీ మాటున రూ.కోట్లు కొట్టేసే కుట్ర

● భూసేకరణ, ఇరిగేషన్ కార్యాలయాల్లో హడావుడి

● ప్రభుత్వం చర్యలు తీసుకోకపోవడమే కారణం

చర్యలు తీసుకోకపోవడమే కారణం

గూడూరుకు చెందిన ఓ లాయర్, నెల్లూరుకు చెందిన మరో లాయర్‌లు ముంపు బాధితుల మాటున రూ.కోట్లు కూడబెట్టుకున్నట్లు ఆరోపణలున్నాయి. అవినీతికి అలవాటు పడిన పలువురు అధికారులు ఈ పాపంలో భాగం పంచుకుంటూ వచ్చారు. ఇటీవల టీజీపీలో జరిగిన అక్రమాల బాగోతం బయటపడుతూ వస్తోంది. నెల్లూరు జిల్లాలో అసలు దానిమ్మ సాగు జరగదు. ఇది ఎవరిని అడిగినా చెబుతారు కానీ, ఇప్పటి వరకూ దానిమ్మ చెట్లకు పరిహారం పేరుతో దాదాపు రూ.400 కోట్లు చెల్లించారంటే అతిశయోక్తి కాదు. ఇంకా అనేక కేసులు హైకోర్టు, సుప్రీంకోర్టుల్లో నడుస్తున్నాయి. అదే మాదిరిగా కలువాయి మండలం పెరంకొండ గ్రామం మాటున కూడా దాదాపు రూ.100 కోట్లు చెల్లించారు. అసలు ముంపు ప్రాంతం కాకపోయినా ఆ గ్రామంలోని భూములకు, ఇళ్లకు పరిహారం, గ్రామస్థులకు ఆర్‌అండ్‌ఆర్ కింద పరిహారం చెల్లించారు. ముంపు గ్రామాలన్నీ ఖాళీ అయినా ఇంకా పెరంకొండ గ్రామం అలానే ఉంది. దీన్ని చూసిన ప్రతీ ఒక్కరూ ఆశ్చర్యాన్ని వ్యక్తం చేస్తుంటారు. ఇక ఈ గ్రామంలో నిర్మాణాలకు జరిపిన పరిహారంలో భారీ కుంభకోణం జరిగింది. దాదాపు రూ.33 కోట్ల ప్రజాధనాన్ని దోచిపెట్టారు. ఇందులో ఓ లాయర్ కీలకంగా వ్యవహరించి తనతోపాటు కొందరు ఉన్నతాధికారులకు పంచిపెట్టారు. ఈ దానిమ్మ చెట్లు, పెరంకొండ కుంభకోణాలపై గతేడాది అప్పటి జేసీ రోణంకి కూర్మనాథ్ విచారణ జరిపి ప్రభుత్వానికి నివేదిక అందజేశారు. తెలుగుగంగ భూసేకరణ విభాగంలో భారీగా అక్రమాలు జరిగాయని నిర్ధారించి, అందుకు బాధ్యులైన వారిపై చర్యలు తీసుకోవడంతోపాటు సీబీఐ విచారణ జరపాలని సిఫార్సు చేశారు. ఈ అవినీతి బాగోతాలు చూసి విస్తుపోయిన నాటి కలెక్టర్ కేవీఎస్ చక్రధర్‌బాబు.. అసలు టీజీపీ భూసేకరణ విభాగాన్ని మూసేయాలని ప్రభుత్వానికి నివేదించారు. నాడు ప్రభుత్వం చర్యలు తీసుకోకపోవడంతో ఇప్పుడు మళ్లీ పరిహారం మాటున దోపిడీకి సిద్ధమయ్యారు.

కొత్త భూములకు మాత్రమే పరిహారం

గతంలో రిక్విజిషన్ ఇచ్చి ఉన్న భూములకు ఇప్పుడు పరిహారం ఇవ్వడం కుదరదు. గతంలో పరిహారం చెల్లించకపోతేనే కొత్తగా పరిహారం చెల్లిస్తాం.

- ప్రేమ్‌కుమార్, టీజీపీ రాపూరు యూనిట్ ఎస్‌డీసీ

ఫ్రెష్ రిక్విజిషన్ ఇవ్వమన్నారు

గుండవోలు గ్రామానికి సంబంధించి ముంపునకు గురైన భూముల వివరాలను ఇవ్వాలంటూ భూసేకరణ విభాగం నుంచి లేఖ వచ్చింది. ముంపునకు గురైన భూముల వివరాలు మాత్రమే అందిస్తాం.

- సత్యప్రసాద్; టీజీపీ ఒకటో డివిజన్ ఈఈ

రూ.11కోట్ల పనులు..
రూ.2.89కోట్ల అవినీతి

- 2023-24లో కలువాయి మండల ఉపాధిహామీ పనుల్లో జరిగిన బాగోతం
- సోషల్ ఆడిట్‌లో నిజాలు వెలుగులోకి..
- మండలాధికారులకే తెలియని పూర్తి సమాచారం
- అక్రమాలపై చర్యలు తీసుకోని ఉన్నతాధికారులు


కలువాయి: సామాజిక తనిఖీల ప్రజావేదికలో పాల్గొన్న అధికారులు, ప్రజా ప్రతినిధులు (ఫైల్)

కలువాయి, ఆగస్టు 4: మండలంలో జరిగిన ఉపాధిహామీ పనుల్లో చోటు చేసుకున్న అవినీతి, అక్రమాలకు బాధ్యులైన వారిపై చర్యలు తీసుకునేందుకు అధికారులు మీనమేషాలు లెక్కిస్తున్నారు. 2023-24 ఆర్థిక సంవత్సరం మండలంలోని 20పంచాయ తీల్లో రూ.11కోట్ల పనులు జరగ్గా అందులో రూ.2.89కోట్లు అవినీతి జరిగినట్లు సోషల్ ఆడిట్‌లో వెలుగులోకి వచ్చింది. గతనెల 26వ తేదీ నిర్వహించిన సామాజిక తనిఖీల బహిరంగ ప్రజావేదికలో సోషల్ ఆడిట్ రాష్ట్ర డైరెక్టర్ ఎం.జగదీష్‌కుమార్ పర్యవేక్షణలో ఆడిట్ బృందాల సభ్యులు పంచాయతీల వారీగా గుర్తించిన అవకతవకలను ప్రొసీడింగ్ ఆఫీసరు, డ్వామా అడిషనల్ పీడీ విజయలక్ష్మీకి తెలిపారు. ఈ అవకతవకలపై ఉపాధి క్షేత్రస్థాయి సిబ్బందిని ఆమె విచారించి వారి వివరణ తీసుకున్నారు. ఇది అంతా బహిరంగ ప్రజావేదికలో గ్రామస్థుల సమక్షంలో జరిగింది. ప్రజావేదికలో విచారణ పూర్తిన తరువాత బహిరంగంగా అవకతవకలపై అధికారులు తీసుకున్న చర్యలు ప్రకటించకపోవడంపై పలువురు గ్రామస్థులు అనుమానాలను వ్యక్తం చేస్తున్నారు. ఎంతసొమ్ము రికవరీకి ఆదేశించారు? ఎవరి నుంచి రికవరీ చేయాలన్న విషయాలను ప్రకటించలేదు. కనీసం మండల అధికారులకు కూడా ఎలాంటి సమాచారం ఇవ్వలేదు. అలాంటప్పుడు గ్రామస్థుల సమక్షమంలో బహిరంగ ప్రజావేదిక నిర్వహించడం ఎందుకు అని వారు ప్రశ్నిసున్నారు. రికవరీ మొత్తాన్ని, ఇందుకు బాధ్యులైన వారిని ఎందుకు అధికారులు గోప్యంగా ఉంచుతున్నారని తెలియడం లేదని వాపోతున్నారు.

చిన్నగోపవరం అక్రమాలపై కంటితుడుపు చర్యలే..

రాష్ట్రంలోనే కనీవినీ ఎరుగని విధంగా చిన్నగోపరంలో జరిగిన అక్రమాలపై అధికారులు తీసుకున్న చర్యలు కంటితుడుపుగా ఉన్నాయి. గ్రామంలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఇతరుల జాబ్ కార్డుల్లో గ్రామానికి సంబంధంలేని బయట వ్యక్తుల పేర్లు చేర్పించారు. ఐదు.. పది పేర్లు కాదు ఏకంగా 148 మంది పేర్లు అక్రమంగా జాబ్ కార్డులలో ఎక్కించారు. వారందరూ ఉపాధి పనులకు వెళ్లినట్లు బోగస్ మస్టర్లు వేసి నిధులు స్వాహా చేశారు. ఈ విషయం గత ఏడాది మార్చిలో డ్వామా అంబుడ్స్‌పర్సన్ వెంకటరెడ్డి విచారణతో వెలుగులోనికి వచ్చింది. ఇటీవల జరిగిన సోషల్ ఆడిట్‌లో కూడా అక్రమంగా జాబ్‌కార్డులలో బయట వ్యక్తుల పేర్లు ఎక్కించి రూ.27.5లక్షలు స్వాహా చేశారని నిర్ధారించారు. పనుల్లో కూడా మరో రూ.18లక్షలు కొలతలు తేడా ఉన్నట్లు మొత్తం రూ.45.37లక్షలు అవకతకలు చోటు చేసుకున్నట్లు సోషల్ ఆడిట్‌లో బయటపడింది. ఈ విధంగా ఉపాధిలో జరిగిన అక్రమాలు చూసి అధికారులతో పాటు సోషల్ ఆడిట్ రాష్ట్ర డైరెక్టర్ కూడా అవాక్కైయ్యారు. ఒక్కచిన్న గ్రామంలో రూ.45లక్షలు అవకతవకలు జరిగితే ఒక్క క్షేత్రసహాయకుడిని మాత్రమే బాధ్యులు చేసి సస్పెండ్ చేసి చేతులు దులుపుకున్నారు. అసలు ఎస్సీ, ఎస్టీల జాబ్‌కార్డులలో బయట వ్యక్తుల పేర్లు ఎక్కిచింది ఎవరు? ఎవరి లాగిన్ నుంచి ఇది చేశారు? వీటిని ఎవరు అప్రూవల్ చేశారు? మరీ దుర్మార్గంగా జార్ఖండ్, తెలంగాణతో పాటు రాష్ట్రంలోని అన్నీ ప్రాంతాలలో ఉండే బ్యాంక్ అకౌంట్‌లు జత చేశారు. వీటిపై కనీసం విచారణ జరిపిన దాఖలాలు కూడా లేవు. క్షేత్రస్థాయి సిబ్బంది సహకారం లేకుండా ఒక క్షేత్రసహాయకుడే ఈ స్థాయిలో అక్రమాలు చేయగలడా? అన్న ప్రశ్నలకు సమాధానాలే లేవు. అక్రమాలు వెలుగుచూసిన వెంటనే ఆన్‌లైన్‌లో ఉన్న జాబ్ కార్డులలో పేర్లు ఉన్నాతాధికారుల ఆదేశాల మేరకు స్థానిక సిబ్బంది తొలగించారు. వీటిపై కనీసం విచారణ కూడా చేయకుండా వాటిని ఆన్‌లైన్‌లోని పేర్లు గుట్టుచప్పుడు కాకుండా తొలగించడంపై గ్రామస్థులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు.

తెరపైకి చిల్లకూరు అంశం..

ఉమ్మడి నెల్లూరు జిల్లాలోని చిల్లకూరు మండలంలోని ఉపాధి పనుల్లో జరిగిన అవకత వకలపై అధికారులు తీసుకున్న చర్యలు ప్రస్తుతం కలువాయిలో తెరపైకి వచ్చాయి. ఇటీవల అక్కడ జరిగిన 16వ విడత సోషల్ ఆడిట్‌లో తనిఖీ బృందాల వారు గుర్తించిన అవకతవకలను సామాజిక తనిఖీ ప్రజావేదికలో అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. వీటిపై స్పందించిన అధికారులు రికవరీకి ఆదేశించడంతో పాటు 23 మంది సిబ్బందిపై సస్పెన్షన్ వేటు వేశారు. ఈ విషయం ఇక్కడ చర్చనీయాంశంగా మారింది. అయితే కలువాయి మండలంలో జరిగిన అవకతవకలపై చర్యలకు అధికారులు మీనమేషాలు లెక్కిస్తుండటం గమనార్హం.

బూడిద నీటితో సాగుకు పనికిరాని పొలాలు

- నష్టపరిహారం చెల్లించాలని రైతుల డిమాండ్

ముత్తుకూరు, ఆగస్టు 4: దామోదరం సంజీవయ్య థర్మల్ విద్యుత్ కేంద్రం బూడిద చెరువుకట్ట తెగి పరిసర గ్రామాల పొలాల్లో బూడిద పేరుకుపోవడంతో ఈ సీజన్‌కి పంట సాగు చేసే పరిస్థితి లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గతంలో యాష్ పాండ్ పైపులైన్‌లు పగిలిపోయి బూడిద నీరు తమ పొలాల్లో చేరి పలు ఇబ్బందులకు గురయ్యామన్నారు. ఎన్నిసార్లు ఫిర్యాదుచేసినా జెన్కో యాజమాన్యం పట్టించుకోలేదన్నారు. ఈసారి ఏకంగా బూడిద చెరువు కట్ట తెగిపోయి బూడిద నీటితో దాదాపు చుట్టుపక్కల గ్రామాల్లోని 100 ఎకరాల ముంపునకు గురయ్యాయని, బూడిద తీస్తే తప్ప సాగుకు పనికిరావని, ఈ సీజన్‌కు పంట నష్టపరిహారం చెల్లించాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు.


జెన్కో సీఈతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సోమిరెడ్డి

రైతులను ఆదుకుంటాం : ఎమ్మెల్యే సోమిరెడ్డి

అధికారులతో మాట్లాడి తక్షణ చర్యలతో ఆదుకుంటామని సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి రైతులకు హామీ ఇచ్చారు. ఆదివారం ఆయన బూడిద చెరువు కట్టను, ముంపునకు గురైన పొలాలను పరిశీలించారు. జెన్కో సీఈ సుధీర్‌బాబు అధికారులతో తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ బూడిద చెరువు కట్ట నిర్మాణంలో నాణ్యత లోపాల వల్లే ఈ ప్రమాదం జరిగిందన్నారు. జిల్లా కలెక్టర్, జెన్కో యాజమాన్యంతో మాట్లాడి రైతులకు నష్టపరిహారం చెల్లించేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మండల టీడీపీ అధ్యక్షుడు పల్లంరెడ్డి రామ్మోహన్‌రెడ్డి, సన్నారెడ్డి సురేష్‌రెడ్డి, బీజేపీ జిల్లా అధ్యక్షుడు వంశీధర్‌రెడ్డి, జనసేన నాయకులు సురేష్‌నాయుడు, టీడీపీ నాయకులు బొమ్మి సురేంద్ర, ఈదూరు రామ్మోహన్‌రెడ్డి, మల్లికార్జున్‌యాదవ్, తదితరులు పాల్గొన్నారు.

న్యాయ విచారణ జరిపించాలి : సీపీఎం


మాట్లాడుతున్న మూలం రమేష్

నెల్లూరు (వైద్యం): ఏపీ జెన్కో బూడిద చెరువు కట్ట తెగిన ఘటనపై న్యాయ విచారణ జరిపించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి మూలం రమేస్ డిమాండ్ చేశారు. సీపీఎం జిల్లా కార్యాలయంలో ఆదివారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నేలటూరులోని ఏపీ జెన్కోకు చెందిన బూడిద కట్టను నాసిరకంగా నిర్మించిన కాంట్రాక్టర్‌పై వెంటనే చర్యలు తీసుకోవాలన్నారు. కట్ట తెగిపోతుందని రైతులు హెచ్చరించినా స్పందించని ఇంజనీర్‌లపై కూడా చర్యలు తీసుకోవాలని కోరారు. దీనివల్ల నష్టపోయిన రైతాంగానికి ఎకరాకు రూ.3లక్షల నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నేతలు మాదాల వెంకటేశ్వర్లు, శ్రీనివాసులు, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

అడ్రస్ అడుగుతూ.. సెల్ లాక్కెళ్లారు !

- పోలీసులకు బాధితురాలి ఫిర్యాదు
- లోకేషన్‌తో ఫోన్ గుర్తించి అందజేత

సంగం: రోడ్డుపై వెళ్లే యువతిని ఇద్దరు యువకులు ఆపి అడ్రస్ అడిగారు. ఆమె చెప్పేలోపే సెల్‌ఫోన్ లాక్కెళ్లారు. ఈ సంఘటన ఆదివారం మండలంలోని ముంబాయి రహదారిపై చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే... స్థానిక బాలికల గురుకుల కళాశాలలో పారిశుధ్య అవుట్ సోర్సింగ్ సిబ్బందిపై సూపర్‌వైజర్‌గా సుగుణ పనిచేస్తుంది. ఈ క్రమంలో శనివారం సాయంత్రం విధులు నిర్వహించి స్కూటీపై ఇంటికి వెళ్తున్నది. ఇద్దరు యువకులు మోటార్ బైక్‌పై ఆమెను వెంబడించి మర్రిపాడుకు దారి అడిగుతూ ఈ ఘటనకు పాల్పడినట్లు ఆమె పోలీసులకు ఫిర్యాదు చేసింది. స్పందించిన వారు ఆదివారం ఫోన్ లోకేషన్‌ను పరిశీలించి సంగం- కలిగిరి రోడ్డులోని సంగం గ్రామానికి చెందిన కందల శివ అనే యువకుడి వద్ద ఫోన్ ఉన్నట్లు గుర్తించారు. ఈ మేరకు అతడిపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

జడ్పీటీసీల ఆత్మీయ సమావేశం


జడ్పీటీసీలతో సమావేశమైన జడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ

నెల్లూరు రూరల్, ఆగస్టు 4 : ఉమ్మడి నెల్లూరు జిల్లాకు చెందిన జడ్పీటీసీల ఆత్మీయ సమావేశం నెల్లూరురూరల్లోని చింతారెడ్డిపాళెంలో జడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ నివాసంలో ఆదివారం జరిగింది. వీరిని ఉద్దేశించి అరుణమ్మ ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో ఎన్‌డీసీసీబీ మాజీ చైర్మన్ ఆనం విజయకుమార్‌రెడ్డి, జడ్పీటీసీలు, తదితరులు పాల్గొన్నారు.

ఊపిరితిత్తుల వ్యాధులకు ఆధునిక వైద్యం

- ప్రతిభ చూపిన వైద్యులకు పురస్కారాలు


ప్రశంసా పత్రాలు అందజేస్తున్న అసోసియేషన్ నేతలు

నెల్లూరు(వైద్యం), ఆగస్టు 4 : ఊపిరితిత్తుల వ్యాధులకు సంబంధించి ఎన్నో ఆధునిక వైద్య విధానాలు అందుబాటులోకి వచ్చాయని పల్మనాలజీ వైద్య నిపుణులు వెల్లడించారు. నెల్లూరు నగరంలోని అనిల్ గార్డన్స్‌లో రెండు రోజులుగా జరుగుతున్న అసోసియేషన్ పల్మోనాలజిస్ట్స్ ఆఫ్ సీమాంధ్ర కాన్ఫరెన్స్ (అప్సాకాన్) అవగాహన సదస్సు ఆదివారం ముగిసింది. ఈ సందర్భంగా చెన్నై కోయం బత్తూరుకు చెందిన ఊపిరితిత్తుల వైద్య నిపుణుడు డాక్టర్ మోహన్‌కుమార్ మాట్లాడుతూ వాతావరణ మార్పులు వల్ల ఊపిరితిత్తు లకు సంభవించే వ్యాధులను ఆధునిక విధానాలతో ఎలా నివారించాలో తెలియజేశారు. విజయవాడకు చెందిన పల్మోనాలజిస్ట్ డాక్టర్ గోపాలకృష్ణ మాట్లాడుతూ క్షయ వ్యాధి నిర్ధారణ, చికిత్స గురించి వివరించారు. హైదరాబాద్‌కు చెందిన డాక్టర్ శుభకర్ క్షయ వ్యాధిని అరికట్టే విధి విధానాలను వివరించారు. ఆస్తమా వ్యాధికి ఎలాంటి ఆధునిక చికిత్సలు అందించాలన్న విధానాలపై గుంటూరు మెడికల్ కళాశాలకు చెందిన డాక్టర్ రఘు, క్షయ వల్ల వచ్చే ఇబ్బందులపై నెల్లూరు నారాయణ కళాశాలకు చెందిన డాక్టర్ కుమార్ అవగాహన కల్పించారు. కర్ణాటక రాష్ట్రంలోని మైసూరుకు చెందిన డాక్టర్ మహేష్ మాట్లాడుతూ ఊపిరితిత్తుల వ్యాధులలో ఎదుర్కొంటున్నా సవాళ్లపై అవగాహన కల్పించారు. అనంతరం ఊపిరితిత్తుల వ్యాధులకు సంబంధించి ప్రవేశ పెట్టిన పత్రాలపై ప్రతిభ చూపిన వైద్యులకు ప్రశంసా పత్రాలు, జ్ఞాపికలను అందజేశారు. ఈ సమావేశంలో అసోసియేషన్ పల్మోనాలజిస్ట్స్ ఆఫ్ సీమాంధ్రం ఆర్గనైజింగ్ కార్యదర్శి డాక్టర్ పిట్టి మల్లికార్జున, ఆర్గనైజింగ్ చైర్మన్ డాక్టర్ గౌరీనాథ్, కోశాధికారి డాక్టర్ లక్ష్మీసుస్మిత, డాక్టర్ రవీంద్రబాబు తదితరులు పాల్గొన్నారు.

విద్యారంగం ఉన్నతికి బీటీఏ పాటుపడాలి

- జిల్లా విద్యాశాఖాధికారి రామారావు


భరోసా పథకం బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న డీఈవో

నెల్లూరు(విద్య), ఆగస్టు 4: విద్యారంగం ఉన్నతికి, ప్రభుత్వ కార్యక్రమాల అమలుకు బీటీఏ పాటుపడాలని జిల్లా విద్యాశాఖాధికారి పీవీజే.రామారావు తెలిపారు. బహుజన టీచర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నగరంలోని జడ్పీ సమావేశ మందిరంలో ఆదివారం జరిగిన 24వ ఆవిర్భావ దినోత్సవంలో ఆయన పాల్గొని మాట్లాడారు. విద్యావ్యవస్థ బలోపేతానికి, ప్రభుత్వ పాఠశాలల పరిరక్షణకు, ఉపాధ్యాయుల సంక్షేమానికి బీటీఏ పని చేయాలన్నారు. ఉపాధ్యాయుల సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించి వారికి అండగా ఉంటామన్నారు. ఉపాధ్యాయ సంఘం నేతలు కూడా తమకు సహకరించి ప్రభుత్వ కార్యక్రమాలను విజయవంతం చేసేందుకు కృషి చేయాలని తెలిపారు. అనంతరం బీటీఏ కుటుంబ సభ్యుల భరోసా పథకాన్ని ఆవిష్కరించి ఉపాధ్యాయులకు సర్టిఫికెట్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కావలి ఎంఈవో గోవిందయ్య, బీటీఏ వ్యవస్థాపకుడు నూకలపాటి రమణయ్య, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిట్టేటి రమేష్, అసోసియేట్ అధ్యక్షుడు పల్లం వేణుగోపాల్, కోశాధికారి ఆదినారాయణ, గౌరవాధ్యక్షుడు మోహన్‌రావు, జిల్లా ప్రధాన కార్యదర్శి మాసా ప్రసాద్, నేతలు ఫెర్డినాండ్, మాల్యాద్రి, రామకృష్ణ, మేరీస్టెల్లా, ఖాజా రంతుల్లా తదితరులు పాల్గొన్నారు.

జెండా ఆవిష్కరించిన రూరల్ ఎమ్మెల్యే

బీటీఏ ఆవిర్భావ దినోత్సవంలో అతిథిగా నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి పాల్గొని బీటీఏ జెండా ఆవిష్కరించి మాట్లాడారు. ప్రభుత్వం ఉపాధ్యాయులకు అండగా ఉంటుందని, వారికి రావాల్సిన అన్ని రకాల సౌకర్యాలు, సమస్యలు పరిష్కరించేందుకు ప్రభుత్వం ముందుంటుందని తెలిపారు. సమస్యలేమైనా ఉంటే తన దృష్టికి తీసుకువస్తే వెంటనే పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.

విద్యుత్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

- రాష్ట్ర అధ్యక్షుడు సాంబశివరావు



సమావేశంలో మాట్లాడుతున్న అధ్యక్షుడు సాంబశివరావు

నెల్లూరు(జడ్పీ), ఆగస్టు 4: విద్యుత్ సంస్థలో పనిచేస్తున్న కార్మికుల సమస్యలను పరిష్కరించాలని ప్రభుత్వానికి విన్నవిస్తామని తెలుగునాడు విద్యుత్ కార్మిక సంఘం నేతలు తెలిపారు. దక్షిణ ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ కార్యనిర్వాహక సమావేశం నగరంలోని రాధాకృష్ణ కల్యాణ మండపంలో ఆదివారం జరిగింది. ఈ సమావేశంలో రాష్ట్ర అధ్యక్షుడు సాంబశివరావు మాట్లాడుతూ ఉద్యోగులకు ప్రతినెలా ఒకటిన జీతాలు, పెన్షన్లు ఇస్తున్నందున ప్రభుత్వానికి ప్రత్యేక ధన్యవాదాలు తెలుపుతున్నామన్నారు. అలాగే కాంట్రాక్టు కార్మికుల క్రమబద్ధీకరణ, జేఎల్‌ఎంలకు గ్రేడ్-1 పదోన్నతులు, పెండింగ్‌లో ఉన్న లాంగ్‌టర్మ్ లోన్లను వెంటనే మంజూరు చేయాలని, తదితర అంశాలపై ప్రభుత్వానికి విన్నవిస్తామన్నారు. గత ప్రభుత్వంలో జారీ అయిన అవకతవకల ఆర్డినెన్సులను రద్దు చేసి, వాటిస్థానంలో ఏపీఎస్‌ఈబీలో ఉన్న ఆర్డినెన్సులను పునరుద్ధరించాలని కోరుతామన్నారు. ఈ సమావేశంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు మధుసూదన్‌రెడ్డి, జనరల్ సెక్రటరీ సుగుణాకర్ రావు, తదితరులు పాల్గొన్నారు.

సకాలంలో వైద్యం అందక వ్యక్తి మృతి

- అందుబాటులో లేని వైద్యులు
- సైదాపురం పీహెచ్‌సీ తలుపులు మూసి బాధితుల ఆందోళన


ఆసుపత్రికి తలుపులు వేసి ఆందోళన చేస్తున్న స్థానికులు

సైదాపురం, ఆగస్టు 4: కూతవేటు దూరంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఉందని అనారోగ్యానికి గురైన వ్యక్తికి అక్కడికి తీసుకెళ్లారు. అక్కడ వైద్యులు లేకపోవడంతో కుటుంబసభ్యులు వైద్యం కోసం అతన్ని గూడూరుకు తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు.ఈ ఘటన ఆదివారం సాయంత్రం మండలకేంద్రంలో చోటుచేసుకుంది. బాధితులు, స్థానికుల కథనం మేరకు, దళితవాడకు చెందిన మల్లవరపు వీర రాఘవయ్య (49)ను కుటుంబసభ్యులు ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. విధులు నిర్వహిస్తున్న స్టాఫ్ నర్సు షాలిని వైద్యులు అందుబాటులో లేరని తెలుపడంతో మెరుగైన చికిత్స కోసం గూడూరుకి వెళ్లమని రెఫర్ చేసింది. దీంతో వారు అక్కడి నుంచి గూడూరు వెళుతున్న సమయంలో మార్గమధ్యలోనే మృతి చెందాడు. విషయం తెలుసుకున్న స్థానికులు, మృతుడి బంధువులు పీహెచ్‌సీకి చేరుకుని వైద్యశాల తలుపులు వేసి ఆందోళనకు దిగారు. ఘటన స్థలానికి ఎస్‌ఐ విజయ్‌కుమార్ చేరుకుని వారికి సర్దిచెప్పారు. వైద్యులు అందుబాటులో లేకపోవడం వల్లే వీర రాఘవయ్య మృతి చెందాడని, వైద్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. పీహెచ్‌సీలో ఇద్దరు వైద్యులు ఉన్నా, వారు స్థానికంగా కాపురం లేకపోవడంతో పేదలకు సకాలంలో వైద్య సేవలు అందడం లేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయమై విచారించి న్యాయం చేయాలని వారు కోరారు.

యువత క్రీడల్లో రాణించాలి : ఎంపీ వేమిరెడ్డి

ఇందుకూరుపేట, ఆగస్టు 4: యువత క్రీడల్లో రాణించాలని ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి సూచించారు.ఇందుకూరుపేట మండలం కొత్తూరు ఎంకేఆర్ హైస్కూల్ క్రీడా మైదానంలో జరుగుతున్న పముజుల శ్రీనివాసులు, మహాలక్ష్మమ్మ స్మారక 11వ రాష్ట్ర బీచ్ కబడ్డీ పోటీల ముగింపు సభ ఆదివారం రాత్రి జరిగింది. ఈ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇందుకూరుపేటలో మినీ స్టేడియం ఏర్పాటుకు కృషి చేస్తానని తెలిపారు. అనంతరం విజేతలకు బహుమతులు అందజేశారు. ఆదివారం జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో పురుషుల విభాగంలో నెల్లూరు, ప్రకాశం జిల్లాల జట్లు తలపడ్డాయి. నెల్లూరు జట్టుపై ప్రకాశం జిల్లా ఒక పాయింట్‌తో విజయం సాధించింది. అలాగే మహిళల విభాగంలో కృష్ణా, విజయనగరం జట్లు తలపడ్డాయి. విజయనగరం జట్టు విజయం సాధించింది. నిర్వాహకులు పముజుల రవి, దాసరి విజయ్‌లను ఎంపీ అభినందించారు. ఈ కార్యక్రమంలో స్థానిక టీడీపీ నాయకులు దువ్వూరు కళ్యాణ్‌రెడ్డి, కోడూరు కమలాకర్‌రెడ్డి, పవన్‌రెడ్డి, కైలాసం ఆదిశేషారెడ్డి, అవ్వారు ఏడుకొండలు, పీఎల్‌రావు, బీజేపీ నాయకులు కైలాసం శ్రీనివాసులురెడ్డి, తదితరులు పాల్గొన్నారు.


పురుషుల విభాగంలో ప్రథమస్థానం సాధించిన ప్రకాశం జిల్లా జట్టుకు షీల్డు అందచేస్తున్న ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి


మహిళల విభాగంలో ప్రథమస్థానం సాధించి, షీల్డు అందుకుంటున్న విజయనగరం జిల్లా జట్టు

ద్విచక్ర వాహనం ఢీకొని చిన్నారికి గాయాలు

- బైక్ నడిపింది 9వ తరగతి విద్యార్థి


తీవ్రంగా గాయపడిన చిన్నారి సహస్ర

కావలి రూరల్, ఆగస్టు 4: స్థానిక వాయునందన ప్రెస్‌వీధిలోని వినాయకస్వామి ఆలయం సమీపంలో ఆదివారం రోడ్డు దాటుతున్న కాలనీకే చెందిన వినోద్ కుమార్తె సహస్ర (4)ను ద్విచక్ర వాహనం అతివేగంగా వచ్చి ఢీకొంది. ఈ ప్రమాదంలో చిన్నారికి గాయాలయ్యాయి. స్థానికులు గమనించి ఆ చిన్నారిని స్థానిక ప్రైవేట్ వైద్యశాలకు తరలించారు. బైక్ నడుపుతున్న వ్యక్తి 9వ తరగతి విద్యార్థి శర్మ. ఈ బాలుడు పట్టణంలోని మానస థియేటర్ ప్రాంతానికి చెందినవాడు. ఇతను మరో బాలుడిని బైక్‌పై ఎక్కించుకని నడుపుతున్నపుడు ఈ ఘటన చోటు చేసుకుంది. వారిని స్థానికులు పట్టుకుని ఒకటవ పట్టణ పోలీసులకు అప్పగించారు.

- **మైనర్లతో తరచూ ప్రమాదాలు:** పట్టణంలోని వాయునందన ప్రెస్‌వీధి, వైకుంఠపురం, పాతూరు, వెంగళరావునగర్ ప్రాంతాల్లోని ప్రధాన కూడళ్లలో బాలురు వాహనాల్లో చక్కర్లు కొడుతూ ప్రమాదాలకు కారణం అవుతున్నా, పోలీసులు, ఆర్టీవో అధికారులు పట్టించుకోవటం లేదన్న విమర్శలు సర్వత్రా వెల్లువెత్తుతున్నాయి. మైనర్లు వాహనాలు నడుపుతూ పట్టుబడితే ముందుగా వారి తల్లిదండ్రులపై అపరాధ రుసుం విధించి వారిపై కేసులు నమోదు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

యువతిపై అసభ్య ప్రవర్తన : వ్యక్తికి దేహశుద్ధి

బుచ్చిరెడ్డిపాళెం, ఆగస్టు 4: ఆలయంలో నిద్రిస్తున్న ఓ యువతి పట్ల అసభ్యంగా ప్రవర్తించిన వ్యక్తికి భక్తులు దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగించిన సంఘటన మండలంలోని జొన్నవాడ ఆలయంలో శనివారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. వివరాలిలా ఉన్నాయి. ఆలయంలో నిద్రచేసే నిమిత్తం ఓ కుటుంబం జొన్నవాడ ఆలయానికి వచ్చి నిద్రిస్తున్నారు. ఫూటుగా మద్యం సేవించిన ఓ వ్యక్తి నిద్రిస్తున్న యువతిపట్ల అసభ్యంగా ప్రవర్తించాడు. దీంతో ఆమె కేకలు వేయడంతో పక్కనేవున్న భక్తులు లేచి సదరు వ్యక్తిని పట్టుకుని దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పజెప్పారు.

ఉన్మాదికి దేహశుద్ధి

మనుబోలు, ఆగస్టు 4: స్థానిక కోదండరామపురంలోని ఎరుకల కాలనీలో ఆదివారం ఓ ఉన్మాదికి స్థానికులు దేహశుద్ధి చేశారు. వివరాలిలా ఉన్నాయి. ఓ వ్యక్తి హిందీలో మాట్లాడుతూ కాలనీలో మహిళలను అసభ్యకరంగా తిడుతూ, డబ్బులు చూపించి వేధిస్తుండడంతో మహిళలు భయాందోళనకు గురయ్యారు. దీంతో స్థానికులు అతనికి దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగించారు.

కోడిపందెం స్థావరంపై పోలీసుల దాడి

వెంకటాచలం: మండలంలోని గొలగమూడి గ్రామ శివారులో ఆదివారం సాయంత్రం కోడిపందెం స్థావరంపై పోలీసులు దాడులు నిర్వహించారు. వెంకటాచలం సీఐ పీ సుబ్బారావు, ఎస్‌ఐ రాజేష్‌లు పోలీసు బృందంతో కలిసి కోడి పందెం స్థావరంపై దాడులు చేసి స్వాధీనం చేసుకున్న నగదు, కోళ్లు, మోటారుబైక్‌లు, పందెంరాయుళ్లను పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. స్వాధీనం చేసుకున్న నగదు, మోటారు బైక్‌ల పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

సోమశిలకు 7,307 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

అనంతసాగరం: సోమశిల జలాశయానికి ఎగువ నుంచి ఆదివారం 7,307 క్యూసెక్కుల నీటి ప్రవాహం వస్తున్నట్లు డ్యాం అధికారులు తెలిపారు. పూర్తిస్థాయి నీటి సామర్థ్యం 77.899 టీఎంసీలు కాగా 11.130 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు చెప్పారు. దిగువ ఉత్తర, దక్షిణ కాలువలకు 10, డెల్టాకు 200 క్యూసెక్కుల సరఫరా అవుతోంది.

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో
బాయిలర్ లైవ్	110
లేయర్ లైవ్	90
స్కిన్ చికెన్	204
స్కిన్‌లెస్	230
లేయర్	153

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)

ఒక గ్రాము ధర	రూ.6713
వెండి కిలో ధర	రూ. 85,900
వెండి ఒక గ్రాము	రూ. 87.90

శ్లాబ్ కుంగింది..
ఇనుప చువ్వలు తేలాయి!

- శిథిలావస్థకు చేరిన పాఠశాల భవనాలు
- నాడు-నేడు కింద మరమ్మతులకు మాత్రమే నిధుల మంజూరు
- నూతన భవనాలు నిర్మించాలని తల్లిదండ్రుల డిమాండ్
- ఇదీ గండిపాలెం మెయిన్ స్కూల్ దుస్థితి


శిథిలావస్థకు చేరిన గండిపాలెం పాఠశాల భవనాలు

ఉదయగిరి రూరల్, ఆగస్టు 4: గండిపాళెం మెయిన్ ప్రాథమిక పాఠశాలకు విద్యార్థులను పంపాలంటే తల్లిదండ్రులు భయపడుతున్నారు. దశాబ్దాల క్రితం నిర్మించిన భవనాలు కావడంతో నేడు పూర్తిగా శిథిలావస్థకు చేరాయి. శ్లాబు పెచ్చులూడి ఇనుప చువ్వలు బయటపడడంతో పాటు కొన్ని గదుల్లోకి చెట్ల వేర్లు చొచ్చుకొచ్చి స్లాబు కుంగిపోయింది. ప్రస్తుతం అడపాదడపా వర్షాలు కురుస్తుండటంతో ఏ సమయంలో ఏ ప్రమాదం సంభవిస్తుందో అని విధులు నిర్వహించే ఉపాధ్యాయులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. 40మంది విద్యార్థులున్నా పాఠశాలలో ప్రస్తుతం వరండాలు, చెట్ల కింద ఉపాధ్యాయులు విద్యాబోధన చేపడుతున్నారు.


దెబ్బతిన్న తరగతి గది కాంక్రీట్ బీమ్

● నిధులు మంజూరైనా నిష్ప్రయోజనమే..

నాడు-నేడు కింద తొలి విడతలో రూ.12లక్షలు, రెండోవిడతలో రూ.16 లక్షలు పాఠశాల మరమ్మతులకు నిధులు మంజూరయ్యాయి. పాఠశాల దుస్థితిని చూసిన కాంట్రాక్టర్లు వీటికి మరమ్మతులు చేయలేం.. వాటిని పడ గొట్టి నూతన తరగతి భవనాలు నిర్మించాలని తేల్చారు. అయితే ఉన్నతాధికారుల నిర్లక్ష్యంతో రెండు విడతల్లో మరమ్మతులకు మాత్రమే నిధు లు మంజూరు చేయడం, నూతన గదుల నిర్మాణానికి నిధు లు మంజూరు చేయకపోవడంపై తల్లిదండ్రులు ఆగ్రహం వ్యక్తం చేశారు.

● అద్దె గదిలోకి మార్చేందుకు యత్నాలు..

ప్రస్తుతం కురుస్తున్న వర్షాలతో భవనాలు కూలిపోతాయో అని తల్లిదండ్రులు వారి పిల్లలను బడికి పంపేందుకు జంకుతున్నారు. ఈ విషయం ఎంఈవో మస్తాన్‌వలి దృష్టికి తీసుకెళ్లడంతో బుధవారం ఆయన గ్రామానికి వెళ్లి తల్లిదండ్రులతో చర్చించారు. తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల సహకారంతో గ్రామంలో పలు నివాసాలను పరిశీలించి అక్కడ పాఠశాల నిర్వహించేందుకు చర్యలు చేపడుతున్నారు.

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం..

- షేక్ మస్తాన్‌వలి, ఎంఈవో, ఉదయగిరి

గండిపాళెం మెయిన్ పాఠశాల దుస్థితిని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. పాఠశాల మరమ్మతులకు నాడు-నేడు పథకంలో రెండుసార్లు నిధులు మంజూరైనా భవనాల దుస్థితి చూసి మరమ్మతులు చేపట్టలేదు. ప్రస్తుతం పాఠశాల భవనాలు పూర్తిస్థాయిలో శిథిలావస్థకు చేరడంతో అద్దె భవనంలో పాఠశాల నిర్వహించేందుకు చర్యలు చేపడుతున్నాం.

ఆత్మకూరుకు పూర్వవైభవం తీసుకువస్తా : మంత్రి ఆనం


ఆత్మకూరు: మాట్లాడుతున్న మంత్రి ఆనం రామనారాయణరెడ్డి


సమావేశంలో పాల్గొన్న అధికారులు, ప్రజాప్రతినిధులు

ఆత్మకూరు, ఆగస్టు 4: ఆత్మకూరు పట్టణానికి పూర్వ వైభవాన్ని తీసుకవస్తా వస్తామని రాష్ట్ర దేవాదాయశాఖ మంత్రి ఆనం రా మనారాయణరెడ్డి తెలిపారు. ఆదివారం పట్టణంలో మంత్రి పర్యటించారు. ముందుగా మున్సిపల్ ప్రజలకు తాగునీరు తాగునీటి శుద్ధిజల కేంద్రాన్ని పరిశీలించారు. అలాగే ఆర్‌అండ్‌బీ అతిథిగృహంలో చేపడుతున్న అభివృద్ధి పనులను పరిశీలించి అధికారులకు సూచనలిచ్చారు. అనంతరం స్థానిక మున్సిపల్ కార్యాలయ సమావేశ మందిరంలో చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. పదేళ్ల క్రితం ఆత్మకూరు రెవెన్యూ డివిజన్‌గా ఏర్పడినా ఇప్పటికీ ఆస్థాయి అభివృద్ధికి నోచుకోలేదని విచారకరం వ్యక్తం చేశారు. ఆత్మకూరును మున్సిపాలిటీగా అప్‌గ్రేడ్ చేసినపుడు భవిష్యత్ అవసరాల దృష్ట్యా రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా రూ.100కోట్లతో తాగునీటి వసతి కల్పించామన్నారు. ఆత్మకూరు ప్రజలకు 20ఏళ్ల పాటు తాగునీటి ఎద్దడి లేకుండా చూసేందుకు రూ.9.04కోట్ల అమృత్ నిధులతో తాగునీటి పథకం పనులు చేపడుతున్నట్లు తెలిపారు. రూ.22.81కోట్ల బీపీఎస్ నిధులతో మున్సిపాలిటీలోని మురుగు కాలువల పూడికతీత పనులు చేపట్టాల్సి ఉందన్నారు. మురుగునీటిని శుభ్రం చేసేందుకు ఐదు సీవేజ్ ట్రీట్మెంట్ ప్లాంట్ల నిర్మాణానికి రూ.3.18 కోట్లు మంజూరైనట్లు తెలిపారు. త్వరలోనే ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు చేతులు మీదుగా అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేయిస్తామన్నారు. నెల్లూరుపాళెం అభయాంజనేయ స్వామి ఆలయం వద్ద నుంచి పట్టణంలోకి వచ్చే రెండు ప్రధాన రహదారుల అభివృద్ధికి చర్యలు చేపడతామన్నారు. బైపాస్ రోడ్డులో వాకింగ్‌కు వీలుగా వాకింగ్ ట్రాక్, డివైడర్లు, రోడ్డుకిరువైపులా లైటింగ్ పనులు చేపడతామన్నారు. స్థానిక ఆర్టీసీ బస్టాండ్ వద్ద నుంచి సోమశిల రోడ్డు సెంటర్ వరకు నిలిచిన ప్రధాన రహదారి విస్తరణ పనులు పూర్తి చేయిస్తామన్నారు. ఆత్మకూరు తహసీల్దారు కార్యాలయ నిర్మాణ పనులను పూర్తిచేయిస్తామన్నారు. మున్సిపాలిటీ అభివృద్ధే లక్ష్యంగా అధికారులు, ప్రజాప్రతినిధులు చర్యలు తీసు కోవాలని సూచించారు.

కొలగాని రామయ్య చౌల్ట్రీ ఆక్రమణపై చర్యలు

ఆత్మకూరు నడిబొడ్డులోని కొలగాని రామయ్య చౌల్ట్రీని కొందరు కబ్జా చేసి దుకాణాలు, భవనాలు నిర్మించారని, వీటి తొలిగింపునకు చర్యలు తీసుకుంటామన్నారు. ఇందులో అర్హులైన పేదలను గుర్తించి వారికి వేరే ప్రదేశంలో స్థలాలు, ఇళ్లు నిర్మించి ఇస్తామన్నారు. అక్కడక్కడ షాపింగ్ మాల్ నిర్మించి దుకాణదారులకు గదులు కేటాయిస్తామని తెలిపారు. పట్టణంలో మంజూరైన ప్రభుత్వ బాలికల గురుకుల పాఠశాలను తాత్కాలికంగా ఏపీ ఎస్సీ గురుకుల పాఠశాల సెకండ్ ఫ్లోర్‌లో ప్రారంభిస్తామన్నారు. అనంతరం ఆయన ఆత్మకూరులోని ఎస్సీ గురుకుల పాఠశాలను పరిశీలించారు. కార్యక్రమాల్లో ఆత్మకూరు ఆర్డీవో మధులత, మున్సిపల్ చైర్‌పర్సన్ వెంకట రమణమ్మ, కమిషనర్ షేక్ ఫజులుల్లా, వైస్‌చైర్మన్ షేక్ సర్దార్, పబ్లిక్ హెల్త్ ఎస్ఈ గోపాల్‌రెడ్డి, జిల్లా బీసీ సంక్షేమశాఖ అధికారి, వెంకటయ్య, ఆత్మకూరు ఉప సంచాలకులు శ్రీదేవి కౌన్సిలర్లు పాల్గొన్నారు.

సపోర్టు స్తంభం ఏర్పాటు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్


ఉదయగిరి నాగులబావివీధిలో విద్యుత్ స్తంభం

ఉదయగిరి రూరల్, ఆగస్టు 4: స్థానిక నాగులబావివీధిలో ఒరిగి కూలేదశలో ఉన్న విద్యుత్ స్తంభానికి ట్రాన్స్ కో అధికారులు సపోర్టుగా మరో స్తంభాన్ని ఏర్పాటు చేశారు. గతనెల 21న ఆంధ్రజ్యోతిలో పొంచి ఉన్న ప్రమాదం అనే కథనం ప్రచురితమైంది. దీనిపై ఏడీఈ కోటేశ్వరరావు, ఏఈ ఖుద్దూస్‌బాషాలు స్పందించి స్తంభాన్ని పరిశీలించి చర్యలు తీసుకున్నట్లు తెలిపారు.

పారిశుధ్యంపై ప్రత్యేక డ్రైవ్


సీతారామపురం: కుర్వవీధి కాలువలో బ్లీచింగ్ పౌడర్ చల్లుతున్న పారిశుధ్య సిబ్బంది

సీతారామపురం. ఆగస్టు 4: ఎంపీడీవో అబ్దుల్ కలాం ఆజాద్ ఆదివారం సీతారామపురం పంచాయతీలోని కురవవీధిలో పారిశుధ్యంపై ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు. మురుగు కాలువల్లో పూడిక తీయించి బ్లీచింగ్ పౌడర్ చల్లించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో అబ్దుల్ కలాం ఆజాద్ మాట్లాడారు. పారిశుధ్యం మెరుగుపరిచే చర్యల్లో భాగంగా ప్రతి వీధిలోని కాలువల్లో దోమల నిర్మూల మందును పిచికారీ చేయించాలని, ఫాగింగ్‌తో పాటు ఆయిల్‌బాల్స్ వేయాలని, ప్రధాన కాలువలతో పాటు వీధి కాలువల్లో సకాలంలో పూడికతీత పనులు చేపట్టాలని కార్యదర్శులకు సూచించారు.

త్రైత సిద్ధాంత గ్రంథాల పంపిణీ

అనంతసాగరం, ఆగస్టు 4: మండలంలోని శంకరనగరం, రేవూరు, లక్కరాజుపల్లి గ్రామాల్లో ఆదివారం ప్రబోధ సేవాసమితి పొదలకూరు కమిటీ సభ్యులు కృష్ణయ్య, కొండయ్య, పెంచలయ్య త్రైత సిద్ధాంతపై ప్రచారం నిర్వహించి గ్రంథాలను పంపిణీ చేశారు.

సయ్యద్ అబ్దుల్ ఖాదర్ దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు


గంధాన్ని దర్గాకు తీసుకవస్తున్న భక్తులు

ఉదయగిరి రూరల్, ఆగస్టు 4: స్థానిక పంచాయతీ బస్టాండ్ సెంటర్‌లో వెలసిన హజరత్ ఖ్వాజాషా సయ్యద్ అబ్దుల్ ఖాదర్‌ఖాన్ సాహెబ్ ఖాదరీ ఔలియా ఉత్సవంలో భాగంగా భక్తులు ఆదివారం దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. దర్గా కమిటీ సభ్యులు స్వామికి భక్తిశ్రద్ధలతో జష్నేచిరాగి పాతెహా కార్యక్రమాన్ని చేపట్టారు. అనంతరం ఖాదరీయ అస్థానం నుంచి అధ్యక్షుడు అహమ్మద్‌బాషా ఆధ్వర్యంలో భక్తులు మేళతాళాలు, ఫకీరు జరు బులతో ఊరేగింపుగా గంధాన్ని ఖాన్‌సాహెబ్ దర్గాకు తీసుకొచ్చారు. చదివింపుల అనంతరం భక్తులకు గంధాన్ని పంచిపెట్టారు. అస్థానంలో భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. దర్గా నిర్వాహకులు రాత్రి కి ఖవ్వాలీ పాటకచేరీ నిర్వహించారు.

బాల చౌడేశ్వరిదేవికి ప్రత్యేక పూజలు


కడవబాణం గ్రామోత్సవం నిర్వహిస్తున్న భక్తులు


అలంకరణలో బాల చౌడేశ్వరిదేవి

సంగం, ఆగస్టు 4: స్థానిక రాళ్లచెలిక, కొత్తూరులోని బాల చౌడేశ్వరిదేవి జయంతిని ఆదివారం భక్తులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారికి అభిషేకాలు నిర్వహించారు. అనంతరం రాళ్లచెలికలోని ఆలయంలో అమ్మవారికి డిస్కో అలంకరణ చేపట్టి ప్రత్యేకపూజలు, మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేశారు. కొత్తూరులో సాయంత్రం నిర్వహించిన కడవ బాణం గ్రామోత్సవం భక్తులను అలరించింది. కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించి మొక్కులు చెల్లించారు.

బుద్ధుడి అష్టాంగమార్గం ఆదర్శనీయం..

వింజమూరు, ఆగస్టు 4: బుద్ధుడు చెప్పిన అష్టంగా యోగ మార్గమే మానవ జీవితానికి ఆదర్శనీయమని దాన్ని ఆచరిస్తే ఎప్పుడు సుఖసంతోషాలతో ఆరోగ్యంగా జీవిస్తూ మోక్షానికి అర్హులవుతామని ఒంగోలు సీనియర్ పిరమిడ్ మాస్టర్ నన్నూరి వాసంతి అన్నారు. ఆదివారం ఆత్మజ్ఞానం కార్యక్రమంలో భాగంగా శ్రీవేదవ్యాస వశిష్ట పిరమిడ్ ధ్యాన మహాశక్తి క్షేత్రంలో జరిగిన సజ్జన సాంగత్యంలో ఆమె ప్రసంగించారు. అనంతరం శాఖాహారం ప్రాముఖ్యతను వివరిస్తూ పిరమిడ్ నగర్, వైశ్యబజార్, కుమ్మరిబారు, ఎర్రబెల్లిపాలెం, ప్రధాన రహదారుల మీద మహాకరుణ కరపత్రాలు పంపిణీ చేస్తూ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో నారాయణరెడ్డి, తిరుపతిరావు, జానకిరామిరెడ్డి, సుబ్బారెడ్డి, చిన్న, వెంకటరెడ్డి, హేమలత, సుప్రజ, సీత, కౌసల్య, శాంతమ్మ, రేణుక, స్వరాజ్యం, కృష్ణవేణి పాల్గొన్నారు.

అలంకార ప్రాయంగా సమాచార బోర్డు

వరికుంటపాడు, ఆగస్టు 4: మండల కేంద్రంలోని వైద్యశాలలో ఏర్పాటు చేసిన సమాచార బోర్డు అలంకారప్రాయంగా దర్శన మిస్తుందని స్థానికులు, వైద్యం కోసం ఆస్పత్రికి వచ్చే రోగులు ఆరోపణలు చేస్తున్నారు. అధికారులు ఎపుడు వస్తారో, ఎపుడు పోతారో తెలియడం లేదంటున్నారు. రాత్రి సమయంలో పరిస్థితి మరింత దారుణంగా ఉంటుంది. వైద్యశాల సమాచార బోర్డులో ఉద్యోగుల పేర్లు, ఫోన్ నంబర్లను నమోదు చేయలేదు.



కావలి
కందుకూరు, ఆత్మకూరు, ఉదయగిరి

మూఢ విశ్వాసాలు పారదోలాలి

కావలిటౌన్, ఆగస్టు 4: శాస్త్రీయ విజ్ఞానంతో మూఢ విశ్వాసాలు పారదోలాలని చాంధస భావాలను అరికట్టాలని జేవీవీ జిల్లా గౌరవాధ్యక్షుడు డాక్టర్ బెజవాడ రవికుమార్ అన్నారు. ఆదివారం స్థానిక రెడ్‌క్రాస్ భవనం సమావేశ మందిరంలో జేవీవీ పట్టణ అధ్యక్షుడు తోట వెంకటేశ్వర్లు అధ్యక్షతన జరిగిన జేవీవీ వార్షిక సమావేశంలో ముఖ్య అతిథులుగా డాక్టర్ రవికుమార్, డాక్టర్ శివప్రసాద్, జేవీవీ జిల్లా ప్రధాన కార్యదర్శి కృష్ణారెడ్డి పాల్గొన్నారు. వక్తలు మాట్లాడుతూ ఏది మంచిదో ఏది చెడ్డదో ప్రజలను చైతన్యవంతులు చేసే బాధ్యత విజ్ఞానవంతులదే అన్నారు. కార్యక్రమంలో గాదిరెడ్డి హరనాథ్, సుబ్బరాయశర్మ, జానికిరామ్, మాధవ, సీ శారద పాల్గొన్నారు.

సామూహిక కుంకుమార్చన

బిట్రగుంట: బోగోలు పంచాయతీలోని హరిజనవాడ పోలేరమ్మ ఆలయ ప్రాంగణంలో ఆషాడమాస ఆదివారాన్ని పురస్కరించుకుని మహిళలు సామూహిక కుంకుమార్చన నిర్వహించారు. అంతకుముందు ఉదయం అభిషేక కార్యక్రమాలు, అర్చకులు సూర్యనారాయణరెడ్డి బృందం సభ్యులు మధ్యాహ్నం చండీయాగం నిర్వహించారు. సామూహిక కుంకుమార్చన ఉభయకర్తలుగా కుందుర్తి బాబు, సునీత దంపతులు, అన్నసంతర్పణలో కుందుర్తి వరప్రసాద్, శ్రీనివాసులు, వెంకటరమణ దంపతులు, చండీయాగంలో ఇనగంటి నాగేశ్వరావు ఆయన ధర్మపతి ఉభయకర్తలుగా వ్యవహరించారు.


జెండా ఊపి 3కే రన్ ప్రారంభిస్తున్న మాజీ గౌవర్నర్ దేవరాల సుబ్రహ్మణ్యం

3కే రన్ ప్రారంభం

బిట్రగుంట, ఆగస్టు 4: బిట్రగుంట వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నియోజకవర్గస్థాయి 3కే రన్ పోటీలు సంఘం అధ్యక్షుడు ఎం.స్వర్ణన్‌రాజు ఆధ్వర్యంలో ఆదివారం ప్రారంభం అయ్యాయి. 4వందల మందికిపైగా ఈ పోటీలో పాల్గొన్నారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా వైద్యులు విజయేంద్ర, చంద్రశేఖర్, చలపతి హాజరైయారు. ఇటీవల మృతి చెందిన వాకర్స్ సభ్యుడు చీకుర్తి మధు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం విజేతలకు మెమోంటోలు, మెడల్స్‌ను అందజేశారు. కార్యక్రమంలో గౌరవాధ్యక్షుడు నూకసాని శ్రీనివాసులు, ఫౌండర్ ప్రెసిడెంట్ కుందుర్తి శ్రీనివాసులు అసోసియేషన్ సభ్యులు ఉన్నారు.

భక్తిశ్రద్ధలతో కనకదుర్గమ్మకు పొంగళ్లు

బిట్రగుంట: బోగోలు మండలం కొండబిట్రగుంటలో కనకదుర్గమ్మ ఉత్సవాల్లో భాగంగా ఆదివారం గ్రామస్థులు అమ్మవారికి పొంగళ్లను నైవేద్యంగా సమర్పించారు. అంతకు ముందు తెలవారుజామున అమ్మవారిని గ్రామ శివారు పోలేరమ్మ ఆలయ ప్రాంగణ సమీపంలోని పొల్లాలోకి చేర్చారు. గ్రామస్తులు కాయాకర్పూర హారతులు, నైవేద్యాలు సమర్పించారు. స్థానిక నేతల రావి విజయ్‌కుమార్, కుటుంబ సభ్యుల ఆహ్వానం మేరకు కావలి ఎమ్మెల్యే దగ్గుమాటి వెంకటక్రిష్ణారెడ్డి, మండల కన్వీనర్ నాగేశ్వరా వు, స్థానిక టీడీపీ నేతలు వేడుకల్లో పాల్గొన్నారు.

చిరుద్యోగులపై వేధింపులు ఆపాలి : సీఐటీయూ

కందుకూరు, ఆగస్టు 4: గ్రామ, వార్డుస్థాయిలో చిరుద్యోగులపై వేధింపులు ఆపాలని సీఐటీయూ జిల్లా కమిటీ బాధ్యులు జీవీబీ కుమార్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. స్థానిక యూటీఎఫ్ కార్యాలయంలో ఆదివారం సీఐటీయూ వలేటివారిపాలెం, ఉలవపాడు మండల కమిటీల సమావేశం జరిగింది. ఈ సమావేశంలో కుమార్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత చిరుద్యోగులైన అంగన్వాడీలు, ఆశాలు, మధ్యాహ్న భోజన పథకం కార్మికులు, స్కూల్ స్వీపర్లు, ఫీల్డ్ అసిస్టెంట్లపై వేధింపులు జరుగుతున్నాయన్నారు. ప్రభుత్వ పెద్దలు ఓవైపు ఎవరిపైనా కక్షసాధింపులు వద్దని చెబుతున్నా క్షేత్రస్థాయిలో పరిస్థితి అందుకు భిన్నంగా ఉందని, వేధింపులు ఆపకపోతే చిరుద్యోగులందరినీ సమీకరించి ఉద్యమించక తప్పదని పేర్కొన్నారు. ఈ సమావేశంలో సాధు చెన్నకేశవులు, వాకా లతారెడ్డి, ఎస్కే నూర్జహాన్, చిమటా శ్రీను, నక్కా కోటేశ్వరరావు, జాన్, చంద్రకుమారి, లక్ష్మీరాజ్యం, రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

శ్రీవివేకా డిగ్రీ కాలేజీలో మెగా జాబ్‌మేళా

● ఉద్యోగాలకు 54మంది ఎంపిక


జాబ్ మేళాలో పాల్గొన్న కంపెనీల ప్రతినిధులు, బీఆర్ ఆక్స్‌ఫర్డ్ విద్యాసంస్థల నిర్వాహకులు

కందుకూరు, ఆగస్టు 4: పట్టణంలోని శ్రీ వివేకా డిగ్రీ కాలేజీలో ఆదివారం బీఆర్ ఆక్స్‌ఫర్డ్ విద్యాసంస్థల ఆధ్వర్యంలో మెగా జాబ్‌మేళా నిర్వహించారు. డిగ్రీ, బీటెక్ విద్యార్హత కలిగిన కళాశాలేతర విద్యార్థినీ విద్యార్థులకు కూడా ఈ జాబ్‌మేళాలో పాల్గొనే అవకాశం కల్పించగా 156 మంది జాబ్‌మేళాలో పాల్గొన్నారు. టెక్ మహీంద్రా, సదర్లాండ్, టెలీ పెర్ఫార్మెన్స్ తదితర కంపెనీలు హాజరై 54మందిని ఉద్యోగాలకు ఎంపికచేసుకున్నట్లు విద్యాసంస్థల చైర్మన్ ఉన్నం భాస్కరరావు తెలిపారు. కార్యక్రమంలో బీఆర్ ఆక్స్‌ఫర్డ్ విద్యాసంస్థల కరస్పాండెంట్ బండి వెంకటేశ్వర్లు, జి బాలభాస్కరరావు, బి నరేంద్రబాబు, అబ్బూరి వెంకటేశ్వర్లు, శ్రీనివాసులు, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ కోసం కష్టపడ్డవారికి గుర్తింపునివ్వండి

● ఎంపీ వేమిరెడ్డికి మోషే విజ్ఞప్తి

కందుకూరు, ఆగస్టు 4: గత ఐదేళ్లలో టీడీపీ ప్రతిపక్షంలో ఉన్నకాలంలో పార్టీకోసం కష్టపడ్డ వారిని గుర్తించి వారికి నామినేటెడ్ పదవులలో సముచిత స్థానం ఇవ్వాలని ఆపార్టీ నెల్లూరు పార్లమెంటు అధికార ప్రతినిధి గోచిపాతల మోషే విజ్ఞప్తి చేశారు. ఈమేరకు ఆదివారం నెల్లూరులో ఎంపీ వేమిరెడ్డి ప్రభాకరరెడ్డిని కలిసి వినతిపత్రం ద్వారా కోరినట్లు మోషే తెలిపారు. పార్టీకోసం కష్టపడ్డవారికి పదవులు ఇవ్వాలనే ఆలోచనలో సీఎం చంద్రబాబు నాయుడు ఉన్నారని తెలిసిందని, అలాంటివారికి నెల్లూరు పార్లమెంటు పరిధిలో నావంతు సహకారం అందిస్తానని వేమిరెడ్డి ప్రభాకరరెడ్డి హామీ ఇచ్చారని మోషే పేర్కొన్నారు. ఆయన వెంట ఎస్సీ సెల్ నాయకులు దువ్వూరి రమేష్‌చంద్ర తదితరులున్నారు.

ఎస్‌ఎంసీ ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థులను గెలిపించాలి

లింగసముద్రం, ఆగస్టు 4 : ఈనెల 8వ తేదీన జరగనున్న స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థులను గెలిపించేందుకు కృషి చేయాలని మండల టీడీపీ అధ్యక్షుడు వేముల గోపాలరావు అన్నారు. ఆదివారం సాయంత్రం లింగసముద్రంలోని టీడీపీ కార్యలయంలో గ్రామ పార్టీ అధ్యక్షుడు గాలంకి ప్రసాద్ అధ్యక్షతన మండల టీడీపీ నాయకులు, కార్యకర్తలతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రతి గ్రామంలోని టీడీపీ నాయకులు ప్రభుత్వ పాఠశాలల్లోని ప్రధానోపాధ్యాయులను, ప్రిన్సిపాళ్లను కలిసి ఎన్నికలకు సమాయత్తం కావాలన్నారు. టీడీపీ నాయకుడు సర్పంచు బొల్లినేని నాగేశ్వరరావు మాట్లాడుతూ హెచ్‌ఎంల దగ్గర ఓటర్ల జాబితాలను తీసుకొని ఎన్నికల్లో నిలబడే అభ్యర్థులను ఎంపిక చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు ఎస్ నారాయణ, ఎ చిన కొండయ్య కిలారి కొండయ్య, ఎ పెదసత్యం, బింకం శేషయ్య, జంపాల కృష్ణయ్య, అడపా కృష్ణ, బొజ్జా శ్రీను, ఉట్లపల్లి మాధవరావు తదితరులు పాల్గొన్నారు.

పెన్షనర్లకు ఈహెచ్‌ఎస్ సేవలు సక్రమంగా అందేలా చూడాలి


సమావేశంలో మాట్లాడుతున్న పెన్షనర్స్ అసోసియేషన్ ప్రతినిధులు

కందుకూరు, ఆగస్టు 4: విశ్రాంత ఉద్యోగులకు ఈహెచ్ ఎస్ క్యాష్‌లెస్ వైద్య సేవలు అందించేందుకు ఆసుపత్రులు అనుమతించటం లేదని, ఆసేవలు సక్రమంగా అందేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని పెన్షనర్స్ అసోసియేషన్ కందుకూరు తాలూకా శాఖ గౌరవాధ్యక్షుడు ఆర్ వెంకటేశ్వర్లు(ఆర్‌వీ) కోరారు. స్థానిక పెన్షనర్ల కార్యాలయంలో ఆదివారం సంఘం కార్యవర్గ సమావేశం జరిగింది. రాష్ట్రంలో టీడీపీ సారథ్యంలోని కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఉద్యోగులు, పెన్షనర్లకు ఒకటి రెండు తేదీలలోనే జీతాలు, పెన్షన్లు వారి ఖాతాలలో జమచే యటం పట్ల ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. గత ఐదేళ్లలో అనేక డీఏ బకాయిలు చెల్లించకుండా అప్పటి ప్రభుత్వం అన్యాయం చేసిందని భవిష్యత్తులో ఆ బకాయిలు చెల్లిం చేందుకు చర్యలు తీసుకోవాలని ఈ సందర్భంగా పెన్షనర్లు విజ్ఞప్తిచేశారు. ఈ సందర్భంగా బుద్ధసమాజం ప్రతినిధి గాండ్ల హరిప్రసాద్ మరణానంతర నేత్రదానం, అవయవదానం ఆవశ్యకతను వివరించగా పలువురు పెన్షనర్లు నేత్రదానంకు అంగీకరించారు. ఈ సమావేశంలో పెన్షనర్ల అసోసియేషన్ ప్రతినిధులు చిమ్మిరి నరసింహం, ఇంటూరి మాల్యాద్రి, చెన్నయ్య, కృష్ణారావు, శ్రీనివాసులు, గణపతిరాజు శేషగిరిరావు తదితరులు పాల్గొన్నారు.

కృష్ణాష్టమి ఊరేగింపు విశిష్టతపై ప్రచారం

కొండాపురం, ఆగస్టు 4: కృష్ణాష్టమి ఊరేగింపు విశిష్టతపై త్రైతసిద్ధాంతం- ప్రబోధ సేవాసమితి హిందూ జ్ఞానవేదిక దుత్తలూరు కమిటీ సభ్యులు ఆదివారం సాయిపేటలో ప్రచారం నిర్వహించారు. దేవుడు అవతరించి ఒక మనిషిగా జన్మిస్తే ఆయనను భగవంతుడు అంటామని కమిటీ అధ్యక్షుడు జి.ప్రసాద్ తెలిపారు. పూర్వం శ్రీకృష్ణాష్టమిని 11 రోజులపాటు నిర్వహించి చివరగా చవితిరోజు ఊరేగింపు ముగించేవారన్నారు. అలాగే త్రైతసిద్ధాంత ఆధ్యాత్మిక గ్రంధముల, ధర్మప్రచారం నిర్వహించారు. జి.పెంచలయ్య, కె.న రసింహులు, ఎంనాగమ్మ, కె.వెంకటసుబ్బమ్మ, డి.రమణయ్య, టి.మాలకొండారెడ్డి, ఎం.సరోజ నమ్మ పాల్గొన్నారు.

కాటంగారి శెట్టి మృతి బాధాకరం: ఎమ్మెల్యే క్రిష్ణారెడ్డి

బిట్రగుంట, ఆగస్టు 4: టీడీపీ మత్స్యకార సీనియర్ నాయకుడు కాటంగారి శెట్టి (80) మృతి చెందడం బాధాకరం అని కావలి ఎమ్మెల్యే దగ్గుమాటి వెంకటక్రిష్ణారెడ్డి అన్నారు. బోగోలు మండలం తూర్పుతీర ప్రాంతమైన తాటిచెట్లపాలెంకు చెందిన ఆయన అనారోగ్యంతో బాధపడుతూ శనివారం రాత్రి మృతిచెందాడు. ఆదివారం ఆయన భౌతికకాయాన్ని సందర్శించి పూలమాల వేసి నివాళులర్పించారు. టీడీపీ మండల కన్వీనర్ మాలేపాటి నాగేశ్వరావు, మాజీ ఆప్కాప్ చైర్మన్ కొండూరు పాల్‌శెట్టి, పైడేరు మాజీ డిస్ట్రిబ్యూటరీ చైర్మన్ బీద గిరిధర్, నెల్లూరు పార్లమెంటరి మత్స్యకార అధ్యక్షుడు పామంజి శేషయ్యలు ఎమ్మెల్యే వెంట ఉన్నారు.

మంత్రి ఆనంను కలిసిన కందుకూరి


మంత్రి ఆనంకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న కందుకూరి

కావలి, ఆగస్టు4: రాష్ట్రదేవదాయశాఖ మంత్రి ఆనం రామ నారాయణరెడ్డిని బీజేపీ రాష్ట్ర సంయుక్త కోశాధికారి కందుకూరి వెంకటసత్యనారాయణ ఆదివారం నెల్లూరులో మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. అనంతరం కావలి నియోజకవర్గంలోని బిట్రగుంటలో రైల్వే అభివృద్ధి పనుల గురించి, నియోజకవర్గ అభివృద్ధికి సంబంధించిన పలు అంశాలను మంత్రితో చర్చించారు.

పాఠశాలల పరిసరాల్లో మద్యం విక్రయాలు

కావలి రూరల్, ఆగస్టు4: బడికి, గుడికి సమీపంలో ఎలాంటి మద్యం అమ్మకాలు చేపట్టరాదన్న నిబంధనలను తుంగలో తొక్కి కావలి మండలం పేపాలవారిపాలెం, అడవిలక్ష్మీపురం గ్రామాల్లోని పాఠశాలల పరిసరాలల్లో విచ్చలవిడిగా మద్యం అమ్మకాలు చేపడుతున్నారు. గత వైసీపీ ప్రభుత్వంలో అధికారాన్ని అడ్డంపెట్టుకుని గ్రామాల్లో విచ్చలవిడిగా బెల్టుదుకాణాలు నిర్వహించారు. పేపాలవారి పాలెంలోని పాఠశాలకు సమీపంలో ఏర్పాటు చేసిన మూడు దుకాణాలతోపాటు అడవిలక్ష్మీపురంలోని పాఠశాల పక్కనున్న కూల్‌డ్రింక్ షాపులో ఉదయం నుంచి అర్ధరాత్రి వరకు అమ్మకాలు సాగిస్తున్నారు. ప్రభుత్వం మారినా వైసీపీ నేతల సహకారంతో పాఠశాలలకు సమీపంలో పోటీ పడి మద్యం అమ్మకాలు సాగిస్తున్నా, అధికారులు పట్టించుకోవడం లేదనే విమర్శలు ఉన్నాయి.

స్కాలర్‌షిప్‌నకు ముగ్గురి ఎంపిక

కందుకూరు, ఆగస్టు 4 : స్థానిక జడ్పీ బాలుర ఉన్నత పాఠశాల నుంచి ముగ్గురు విద్యార్థులు నేషనల్ మీన్స్ మెరిట్ స్కాలర్‌షిప్‌కు ఎంపికయ్యారని హెచ్‌ఎం ఎం. నరసింహమూర్తి ఒక ప్రకటనలో తెలిపారు. పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న కే జోయల్‌సుధాకర్, కే. కేతన్, బీ. రామకృష్ణలు ఎన్‌ఎంఎంఎస్‌కు ఎంపికయ్యారని, వీరికి ఐదేళ్లపాటు ప్రతి ఏటా రూ. 12వేలు నగదు ప్రోత్సాహకం కేంద్రప్రభుత్వం నుంచి అందుతుందని ఆయన తెలిపారు.

పీహెచ్‌సీని 30 పడకల వైద్యశాలగా అభివృద్ధి చేయండి

కొండాపురం, ఆగస్టు 4: స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని 30పడకల వైద్యశాలగా అభివృద్ధి చేయాలంటూ బీజేపీ మండలాధ్యక్షుడు మాలేపాటి మల్లికార్జున ఆదివారం ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. మండలంలో 45 వేలమంది జనాభా ఉన్నా మెరుగైన వైద్యం లేక 50 కిలోమీటర్ల దూరం ప్రయాణం చేయాల్సి వస్తుందన్నారు. అలాగే నీటిలో ఫ్లోరిన్ ఎక్కువగా ఉండటంతో ప్రజలు ఎక్కువగా అనారోగ్యాలకు గురవుతున్నాట్లు పేర్కొన్నారు. ప్రజా సమస్యలను దృష్టిలో పెట్టుకొని 30పడకల వైద్యశాలతో నూతన భవన నిర్మాణం, వైద్యాధికారులతో పాటు సిబ్బందికి క్వార్టర్లు, స్టాఫ్ నర్సులు, సెక్యూరిటీని ఏర్పాటు చేసి 24గంటలు వైద్యం అందేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

మైత్రి దినోత్సవంలో పూర్వ విద్యార్థులు

● మొక్కలు నాటిన స్నేహితులు


మొక్కలు నాటుతున్న పూర్వ విద్యార్థులు

కావలి టౌన్, ఆగస్టు 4: స్థానిక విశ్వోదయ బాలుర ఉన్నత పాఠశాల 1981 బ్యాచ్ పూర్వ విద్యార్థులు అంతర్జాతీయ మైత్రీ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆదివారం మద్దూరుపాడు ప్రాంతంలో సమావేశమై వేడుకలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా వారు మొక్కలు నాటారు. పూర్వ విద్యార్థి రెడ్‌క్రాస్ చైర్మన్ రవిప్రకాష్ మాట్లాడారు. తమ స్నేహితుడు రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయుడు అవార్డు గ్రహీత పీ మురళీకృష్ణ నెల్లూరు కార్పొరేషన్‌లో ఉపాధ్యాయుడిగా విధులు నిర్వహిస్తూ విద్యార్థులు, స్థానికుల సహకారంతో పెన్నా నది తీరంలో వేలాది మొక్కలు నాటించారని గుర్తు చేశారు. అతని స్ఫూర్తి, సూచనల మేరకు మొక్కలు నాటే కార్యక్రమానికి శ్రీకారం చుట్టామన్నారు. అందుబాటులోనున్న స్నేహితులు ప్రతి ఆదివారం విశ్వోదయ పాఠశాలలో మొక్కలు నాటి వాటిని సంరక్షించాలన్నారు. పూర్వ విద్యార్థి, సహచర మిత్రులు ఎమ్మెల్యే కృష్ణారెడ్డి పట్టణంలో 31వేల చెట్లు పెంచాలన్న సంకల్పానికి మద్దతుగా మొక్కలు నాటే కార్యక్రమాన్ని విస్తృతం చేస్తామన్నారు. కార్యక్రమంలో డాక్టర్ దూబగుంట రవికుమార్, సాయిబాబ రోసిరెడ్డి, ద్రోణాదుల వెంకట్రావు, సత్యప్రసాద్ పాల్గొన్నారు.

పంచాయతీ బస్టాండులో కనీస వసతుల కరువు

● మరుగుదొడ్లు లేక ప్రయాణికుల అవస్థలు

పొదలకూరు, ఆగస్టు 4 : పంచాయతీ బస్టాండులో కనీస వసతులు లేక ప్రయాణికులు అవస్థలు పడుతున్నారు. పొదలకూరు పట్టణం చుట్టుపక్కల దాదాపు 7 మండలాలకు కేంద్ర బిందువుగా ఉన్న పొదలకూరు పంచాయతీ బస్టాండ్ మీదుగా నిత్యం వేల సంఖ్యలో రాజంపేట, పెంచలకోన, మనుబోలు, సైదాపురం, చేజర్ల, కలువాయి, సంగం, నెల్లూరుకు ప్రయాణికులు రాకపోకలు సాగిస్తూ ఉంటారు. అయితే ఈ బస్టాండ్‌లో కనీసం బస్‌షెల్టర్లు, మరుగుదొడ్లు సక్రమంగా లేక ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు.

మరుగుదొడ్ల చుట్టూ ఆక్రమణలు

కాగా, బస్టాండులోని మరుగుదొడ్ల చుట్టూ ఆక్రమణలు, దుకాణాలు వుండడంతో నూతన వ్యక్తులు, మహిళలు గుర్తించలేకపోతున్నారు. గతంలో ఈ ఆక్రమణలను తొలగించినా తిరిగి వారు యధాప్రకారం మరుగుదొడ్ల చుట్టూ దుకాణాలు ఏర్పాటు చేసుకోవడంతో ఈ సమస్య మొదటికొచ్చింది. ముఖ్యంగా మహిళలు మరుగుదొడ్లలోకి ప్రవేశించలేక ఇబ్బందులు పడుతున్నారు. అలాగే పొదలకూరు పంచాయతీ బస్‌షెల్టర్ పూర్తిగా ఆక్రమణలకు గురైంది. బస్‌షెల్టర్‌లో కనీసం ప్రయాణికులు నిలబడేందుకు కూడా వీలు లేకుండా దుకాణాల వారు వారి సామాగ్రిని అమర్చుకున్నారు.



మరుగుదొడ్లు కనిపించకుండా ఏర్పాటైన దుకాణాలు

పంచాయతీ బస్టాండులోని బస్‌షెల్టర్, గేట్ సెంటర్‌లోని బస్‌షెల్టర్ మురికికూపంగా మారాయి. అలాగే గేట్ సెంటర్‌లో కూడా నిత్యం హైస్కూల్ విద్యార్థులు, ఉపాధ్యాయులు, వివిధ ప్రాంతాల నుంచి పొదలకూరులో ఉద్యోగరీత్యా పలువురు రాకపోకలు సాగిస్తుంటారు. వారికి కనీసం మరుగుదొడ్లు లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. దీనిపై పంచాయతీ కార్యదర్శి దొరబాబును వివరణ కోరగా.. పంచాయతీ బస్టాండ్‌లో మరుగుదొడ్లు ఆక్రమణకు గురైన మాట వాస్తవమేనని, త్వరలో ఆక్రమణలు తొలగిస్తామని, బస్‌షెల్టర్‌ను కూడా పరిశుభ్రంగా ఉంచుతామని తెలిపారు.

డిప్యూటీ కలెక్టర్‌కి సన్మానం



వెంకట సుధాకర్ దంపతులను సన్మానిస్తున్న నేతలు

నెల్లూరు(వ్యవసాయం), ఆగస్టు 4 : డిప్యూటీ కలెక్టర్ హోదాలో బాపట్ల సర్వశిక్ష అభియాన్ అడిషనల్ ప్రాజెక్టు కోఆర్డినేటర్‌గా పదవీ విరమణ పొందిన మలవత్తు వెంకట సుధాకర్ దంపతులను చేనేత ఐక్యకార్యాచరణ కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం నగరంలో ఘనంగా సన్మానించారు. ఈసందర్భంగా పలువురు చేనేత సంఘాల నాయకులు మాట్లాడుతూ జిల్లాలోని సివిల్ సప్లైస్ విభాగంలో ఎంతో కాలం పనిచేసి మంచి గుర్తింపు తెచ్చుకున్నారని, ముఖ్యంగా చేనేతలకు అండగా నిలిచి అనేక సహాయ సహకారాలను అందించారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో మాజీ శాసనమండలి సభ్యుడు బూదాటి రాధయ్య, కొడవలూరు మండలం దామయ్యగుంట సర్పంచి శేషగిరి, బీజేపీ నేత కనపర్తి నాగేంద్ర, ఐక్య కార్యాచరణ కమిటీ అధ్యక్షుడు బుధవరపు బాలాజీ, గౌరవాధ్యక్షుడు అశ్వర్థామ, రామనాథం రాజశేఖర్, సోమా గోపాల్ పాల్గొన్నారు.

వైభవంగా పోలేరమ్మ జాతర



అన్నదానం చేస్తున్న నగర కమిషనర్ రమణబాబు

బుచ్చిరెడ్డిపాళెం, ఆగస్టు 4: నగర పంచాయతీలోని రాఘవరెడ్డి కాలనీలో గ్రామదేవత పోలేరమ్మ జాతర ఆదివారం వైభవంగా జరిగింది. ముందుగా అమ్మవారికి ప్రత్యేక పుష్పాలంకరణ, పూజలు నిర్వహించారు. స్థానిక భక్తులు అధిక సంఖ్యలో అమ్మవారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. అనంతరం భక్తులకు పెద్దఎత్తున అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. పూజల్లో పాల్గొన్న నగర పంచాయతీ కమిషనర్ వెంకట రమణబాబు భక్తులకు అన్న ప్రసాదాలను పంపిణీ చేశారు.

గిరిజనులకు అన్యాయం జరిగితే సహించం

● సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి

ముత్తుకూరు, ఆగస్టు 4: గిరిజనులకు అన్యాయం జరిగితే సహించేది లేదని సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి స్పష్టంచేశారు. కుమ్మరమిట్టలో ఎస్సీ కాలనీలో ఆదివారం దివంగత దువ్వూరు గోపాల్‌రెడ్డి జ్ఞాపకార్థం ఏర్పాటుచేసిన డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి నిర్మించిన మండపాన్ని ఆవిష్కరించారు. అనంతరం అరుంధతీయవాడలో తిరునాళ్ల సందర్భంగా మాతమ్మను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మల్లూరులో గిరిజనుల ఇళ్లను ఖాళీ చేయించి ఆ స్థలాలను వైసీపీ నాయకులు తమ పొలాల్లో కలిపేసుకోవడం దుర్మార్గమన్నారు. మా ప్రభుత్వ హయాంలో ప్రతి గిరిజన కుటుంబానికి సంక్షేమ పథకాలు అందేలా చూస్తామన్నారు. ప్రతి గిరిజనుడికి ఆధార్‌కార్డు జారీని ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్నామన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ దువ్వూరు విజయకుమార్‌రెడ్డి, హరిప్రసాద్‌రెడ్డి, హేమంత్ కుమార్‌రెడ్డి, మండల టీడీపీ అధ్యక్షుడు పల్లంరెడ్డి రామ్మోహన్‌రెడ్డి, నాయకులు బొమ్మి సురేంద్ర, ఈదూరు రామ్మోహన్‌రెడ్డి, నీలం మల్లికార్జున్‌యాదవ్, షేక్.షఫీవుల్లా పాల్గొన్నారు.

'నీ భవిష్యత్ నీచేతుల్లోనే' పుస్తకావిష్కరణ



పుస్తకావిష్కరణ సభలో పాల్గొన్న రచయితలు

నెల్లూరు(సాంస్కృతికం), ఆగస్టు 4: నగరంలోని శ్రీవెంకటేశ్వర విద్యాలయంలో మోపూరు పెంచలనాయుడు ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆదివారం మోపూరు పెంచలనరసింహం రచించిన నీ భవిష్యత్ నీ చేతుల్లోనే పుస్తకావిష్కరణ జరిగింది. ఈ కార్యక్రమంలో పెన్నా రచయితల సంఘం అధ్యక్షురాలు గోవిందరాజు సుభద్రాదేవి, గౌరవాధ్యక్షుడు అవ్వారు శ్రీధర్‌బాబు, కార్యదర్శి తోట సులోచనలు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. కవి సమ్మేళనం అలరించింది. ఈ సందర్భంగా పుస్తక రచయిత మోపూరు పెంచలనరసింహంను ఘనంగా సత్కరించారు. షంషుద్దీన్, గంగిశెట్టి శివకుమార్, మధుసూదన్‌రావు పాల్గొన్నారు.

సోమిరెడ్డి ఆరోపణలు అవాస్తవం

● కాంగ్రెస్ నేత నారపరెడ్డి కిరణ్‌కుమార్‌రెడ్డి

మనుబోలు, ఆగస్టు 4: ఇటీవల సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి తనపై చేసిన ఆరోపణలన్నీ అవాస్తవాలేనని కాంగ్రెస్ పార్టీ నాయకుడు నారపరెడ్డి కిరణ్‌కుమార్ రెడ్డి ఖండించారు. ఆదివారం ఆయన అక్కంపేటలో గ్రామస్థులతో కలిసి విలేఖర్ల సమావేశం ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాను 2024లో అక్కంపేట గ్రామంలో పనులు చేయనేలేదని, చేసినట్లుగా తప్పుడు పత్రాలు తీసుకువచ్చి రూ. 5.90 కోట్లు పనులు చేయకుండానే తినేశారని చెప్పడం సరికాదన్నారు. ఎవరు పనులు చేశారన్నది తెలుసుకోకుండానే తనపై నిరాధార ఆరోపణలు చేయడం పద్ధతి కాదన్నారు. తాను కాకాణికి బినామీ కాదన్నారు.

చెరువుకట్టకు మరమ్మతులు చేపట్టాలి

● ఇరిగేషన్ అధికారులకు రైతుల మొర



కోతకు గురైన కొలనుకుదురు చెరువుకట్ట

మనుబోలు, ఆగస్టు 4: కోతకు గురైన మండలంలోని కొలనుకుదురు చెరువుకట్టకు మరమ్మతులు చేపట్టాలని రైతులు కోరుతున్నారు. గతేడాది కోట్ల రూపాయలతో చెరువు కట్టలను బాగుచేశారు. నాణ్యతలేకుండా పనులు చేయడంతో వర్షాలకు చెరువునిండి కట్ట కోతకు గురైంది. మరో పక్క చెరువులో మట్టిని తరలించేందుకు కట్ట మధ్యభాగంలో దారితీసి ఉన్నారు. కట్టదెబ్బతిని ఏడాది కావస్తున్నా ఇంతవరకు పట్టించుకోలేదు. మరల వర్షాలు రాబోతున్నాయి. ఈసారి వర్షాలకు కట్ట ఇలానే ఉంటే చెరువు అనుకుని ఉన్న దళితవాడ మునిగిపోతుందని కాలనీవాసులు ఆందోళనలో ఉన్నారు. ఇప్పటికైనా ఇరిగేషన్ అధికారులు స్పందించి దెబ్బతిన్న చెరువుకట్టను త్వరగా మరమ్మతులు చేయించాలని రైతులు కోరుతున్నారు.

కమ్యూనిటీ హెల్త్ అధికారికి సన్మానం



జయశ్రీని సన్మానిస్తున్న చేజర్ల సుధాకర్ రావు

నెల్లూరు(వైద్యం), ఆగస్టు 4 : వైద్య ఆరోగ్యశాఖలో కమ్యూనిటీ హెల్త్ అధికారిగా 40 ఏళ్ల పాటు ఏటూరి జయశ్రీ వైద్య సేవలు అందించారని హెల్త్ అడ్మినిస్ట్రేషన్ మెడికల్ సర్వీసెస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు చేజర్ల సుధాకర్‌రావు కొనియాడారు. నెల్లూరు నగరంలోని వనంతోపు వద్ద ఓ ప్రైవేట్ భవనంలో ఆదివారం జయశ్రీ ఉద్యోగ విరమణ కార్యక్రమం జరిగింది. హంస జిల్లా అధ్యక్షుడు, మహిళా అధ్యక్షురాలు ఇందిరలు జయశ్రీని ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ మున్వర్ సుల్తానా, హంసా జిల్లా అదనపు కార్యదర్శి ఉమా మహేశ్వర్, ఉపాధ్యక్షులు రవీంద్ర, సుధాకర్, లక్ష్మణ్, శైలజ, సుశీల, ధనలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

రేపు ప్రత్యేక విద్యుత్ అదాలత్

పొదలకూరు, ఆగస్టు 4 : ఆంధ్రప్రదేశ్ దక్షిణ ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార వేదిక ఆధ్వర్యంలో మంగళవారం ప్రత్యేక విద్యుత్ అదాలత్ నిర్వహిస్తున్నట్లు విద్యుత్ ఏఈ శ్రీకాంత్ ఆదివారం తెలిపారు. పట్టణంలోని గేట్ సెంటర్‌లోని 33/11కేవీ విద్యుత్ ఉపకేంద్రంలో ఈ ప్రత్యేక విద్యుత్ అదాలత్ నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమానికి ఛైర్‌పర్సన్ పి శ్రీనివాస ఆంజనేయమూర్తి (రిటైర్డ్ జడ్జి), ఆర్థిక సభ్యులు కె రామమోహన్‌రావు, సాంకేతిక సభ్యులు ఎస్‌ఎల్ అంజనీకుమార్, స్వతంత్ర సభ్యులు జి ఈశ్వరమ్మ పాల్గొని నెల్లూరు రూరల్ ఆపరేషన్ డివిజన్ పరిధిలోని పొదలకూరు, నెల్లూరు రూరల్, ముత్తుకూరు సబ్ డివిజన్‌కు సంబంధించిన ప్రత్యేక విద్యుత్ అదాలత్ నిర్వహిస్తారన్నారు. విద్యుత్ వినియోగదారులు సమస్యలను పరిష్కరించుకోవాల్సిందిగా కోరారు.

గాంధీ ఆశ్రమంలో సర్వమత ప్రార్థనలు

ఇందుకూరుపేట, ఆగస్టు 4: మండలంలోని పల్లెపాడు పినాకినీ సత్యాగ్రహ గాంధీ ఆశ్రమంలో కోకన్వీనర్ నెల్లూరు రవీంద్రరెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం సర్వమత ప్రార్థనలు జరిగాయి. ముందుగా గవిని శ్రీనివాస్ గాంధీ, ఆశ్రమ కమిటీ సభ్యులు గంపల మంజుల మహాత్మాగాంధీ, స్థలదాత పొణక కనకమ్మల విగ్రహాలకు నూలు మాలలు, ఖాదీ వస్త్రాలు సమర్పించారు. ఈ కార్యక్రమంలో ఆదెమ్మసత్రం హైస్కూల్ పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు. వారికి ఆశ్రమం చరిత్ర గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు జీవీ రామిరెడ్డి, గణేశం దయాకర్‌రెడ్డి, గణేశం సుమంత్‌రెడ్డి, షేక్ అల్లాబక్షు, వేణురెడ్డి, స్కూలు విద్యార్థులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

కంపుకొడుతున్న గుమ్మళ్ళదిబ్బ



గుమ్మళ్ళదిబ్బ కాలనీలో పేరుకుపోయిన చెత్త

కోవూరు, ఆగస్టు 4: పట్టణంలోని గుమ్మళ్ళదిబ్బ కాలనీలో పారిశుధ్య లోపంతో ప్రజలు అవస్థలు పడుతున్నారు. కోవూరు- పాటూరు రోడ్డు మార్గంలోని ఈకాలనీలో చెత్తకుప్పలు పేరుకుపోయి అధ్వానంగా తయారైంది. గిరిజన, బీసీ కాలనీల్లో పారిశుధ్యలోపాన్ని నివారించేందుకు పంచాయతీ ఎలాంటి చర్యలు తీసుకోవడంలేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కోవూరులోని ప్రధాన రహదారి, కూడళ్లల్లో చెత్తాచెదారం పేరుకుపోతోంది. ప్రభుత్వ కార్యాలయాలున్న తాలూకాఫీసు కూడలి బజారువీధి, కాపువీధి, సత్రం వీధుల్లో ఎక్కడ చెత్త అక్కడే నిలిచిపోతోంది. చెత్త నిల్వచేరడంతో దోమలు స్వైరవిహారం చేస్తున్నాయి. పారిశుధ్యలోపం వల్ల దోమలు కుట్టి డెంగ్యూ వ్యాధి ప్రబలుతుందని పేదలు ఆందోళన చెందుతున్నారు. పంచాయతీ సిబ్బంది పట్టణంలో పారిశుధ్యలోపాన్ని తొలగించాలని ప్రజలు కోరుతున్నారు. వర్షాకాలంలో మురుగు సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని కూడా వారు కోరుతున్నారు.

జెన్కో సంఘటనపై విచారణ చేపట్టాలి

ముత్తుకూరు, ఆగస్టు 4: జెన్కో బూడిద చెరువు కట్ట తెగి ముంపునకు గురైన పొలాలను ఆదివారం మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి పరిశీలించారు. సంఘటనపై సమగ్ర విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మండల వైసీపీ కన్వీనర్ మెట్టా విష్ణువర్ధన్‌రెడ్డి, నెల్లూరు శివప్రసాద్, ఈపూరు కోటారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఈ భవనాలకు మోక్షం ఎప్పుడో..!

● వైసీపీ పాలనలో ముందుకు సాగని నిర్మాణాలు

మనుబోలు, ఆగస్టు 4: వైసీపీ ఐదేళ్ల పాలనలో పర్లపాడులోని అంగన్‌వాడీ కేంద్రం, లింగారెడ్డిపల్లి గ్రామ ప్రాథమిక పాఠశాల భవనాల నిర్మాణం ఒక్క అడుగు ముందుకు కదలలేదని గ్రామస్థులు విమర్శిస్తున్నారు. 2014-19 మధ్య టీడీపీ హయాంలో వీటి నిర్మాణం ప్రారంభించారు. 2019లో వైసీపీ ప్రభుత్వం రాగానే నిర్మాణాలు నిలిచిపోయాయి. కనీసం నాడు-నేడు కిందకు ఈ భవనాలను తీసుకువచ్చి నిర్మించలేదు. అలాగే రాజవోలు పాడులో అంగన్‌వాడీ కేంద్రం నిర్మాణం అర్థాంతరంగా ఆగిపోయింది. కాగా, మరలా అధికారంలోకి వచ్చిన టీడీపీ ప్రభుత్వం భవనాలు పూర్తిచేయాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.



పునాదుల్లోనే నిలిచిపోయిన పర్లపాడు అంగన్‌వాడీ కేంద్రం

తాత్కాలిక గణపతి మండపాలకు ఒకే చోట అనుమతి

నెల్లూరు(సాంస్కృతికం), ఆగస్టు 4 : వచ్చే నెల 7 నుంచి 11వ తేదీ వరకు జరిగే గణేష్ ఉత్సవ తాత్కాలిక మండపాలకు పోలీసు, మున్సిపాలిటీ, విద్యుత్ శాఖల అనుమతులన్నీ ఒకేచోట ఇప్పించేందుకు కృషి చేస్తున్నామని విక్రమ సింహపురి గణేష్ ఉత్సవ కమిటీ అధ్యక్షుడు పిట్టి సత్యనాగేశ్వరరావు తెలిపారు. ఆదివారం నగరంలోని టీఏఎస్ కళ్యాణ సదన్‌లో నెల్లూరు కార్పొరేషన్ పరిధిలో తాత్కాలిక గణపతి మండపాల నిర్వాహకుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గణేష్ ఉత్సవ సమితి నిర్వాహకులకు తమ కమిటీ పూర్తి సహకారం అందిస్తుందని తెలిపారు. సెప్టెంబరు 11న గణేష్ నిమజ్జనం వేడుకలు మూలాపేట గణేష్ ఘాట్‌లోనే జరుగుతాయని తెలిపారు. అందుకు స్వర్ణాల చెరువులో గుర్రపు డెక్క తొలిగించడం, విద్యుత్, పారిశుద్ధ్యం, ఇతర సౌకర్యాలను నగర పాలక సంస్థ ద్వారా కల్పిస్తామని తెలిపారు. మంత్రులు పొంగూరి నారాయణ, ఆనం రామనారాయణరెడ్డిల సహకారంతో గణేష్ ఉత్సవాలకు నెల్లూరు నగరాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నామన్నారు. ఉత్సవ నిర్వాహకులు సహాయ సహకారాలకు అధ్యక్షుడు పిట్టి సత్యనాగేశ్వరరావు 80081 70088, కార్యనిర్వాహక అధ్యక్షుడు వేలూరు మహేష్ 92464 30089, ప్రధాన కార్యదర్శి పి.సురేంద్రరెడ్డి 94402 75274లను సంప్రదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో యరబోలు రాజేష్, మండ్ల ఈశ్వరయ్య, కొండపల్లి శ్రీకాంత్, ఉచ్చి భువనేశ్వరీప్రసాద్, కేవీ సుబ్రహ్మణ్యం, బీఎస్ రంగరాజన్, కాకు మురళీరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న పిట్టి సత్యనాగేశ్వరరావు

ఉత్సాహంగా కృష్ణాష్టమి పోటీలు



కృష్ణాష్టమి పోటీలకు హాజరైన ఎంపీ వేమిరెడ్డి

నెల్లూరు(సాంస్కృతికం), ఆగస్టు 4 : సెప్టెంబరు నెలలో వచ్చే శ్రీకృష్ణాష్టమి సందర్భంగా ఆదివారం నెల్లూరు ఇస్కాన్ మందిరంలో చిన్నారులకు వివిధ పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమాలకు ముఖ్యఅతిథిగా నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, డాక్టర్ పల్లంరెడ్డి యశోధర పాల్గొని ప్రారంభించారు. చిన్నతనం నుంచే బాలల్లో ఆధ్యాత్మిక విలువలను పెంచే కార్యక్రమాలు చేస్తున్న ఇస్కాన్ మందిరం ఛైర్మన్ డాక్టర్ సుకదేవస్వామి సేవలను అభినందించారు. పోటీలలో ఉత్సాహంగా పాల్గొన్న చిన్నారులను, వారి తల్లిదండ్రులను, ఉపాధ్యాయులను ప్రశంసించారు. చిన్నారులకు కంఠస్థ పోటీలు, చిత్రలేఖనం, దేవతామూర్తుల వేషధారణలు, గ్రీటింగ్ కార్డులు తయారీ పోటీలు జరిగాయి.

ప్రాకారోత్సవంలో ఆండాళ్ అమ్మవారు

నెల్లూరు(సాంస్కృతికం), ఆగస్టు 4 : నగరంలోని తల్పగిరి రంగనాథస్వామి ఆలయంలో ఆండాళ్ తాయార్ తిరువాడిప్పూడి ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. ఆదివారం ఉదయం తిరుమంజనం, విశేష అలంకారం, పూజలు, సాయంత్రం ప్రాకారోత్సవం, మాలలుమార్పు, ఊంజలసేవలు జరిగాయి.

స్నేహితుల ఆత్మీయ సమ్మేళనం



స్వీట్లు పంచుతున్న వివేకానంద వాకర్స్ సభ్యులు

నెల్లూరు(విద్య), ఆగస్టు 4: స్నేహితుల దినోత్సవాన్ని పురస్కరించుకుని స్నేహితుల ఆత్మీయ సమావేశం ఆదివారం అట్టహాసంగా జరిగింది. నగరంలోని ఏసీ సుబ్బారెడ్డి స్టేడియంలో స్నేహితులతో ఏర్పడిన వివేకానంద వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వాకర్స్‌కు ఫ్రెండ్‌షిప్ బ్యాండ్‌లు కట్టి స్వీట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో అధ్యక్ష, కార్యదర్శులు డీవీ.సుబ్బరాజు, స్వర్ణ రమేష్, అసోసియేషన్ నేతలు మేకల నరేంద్రరెడ్డి, జయదేవ్, రామవేంద్రశెట్టి, చింతల అమరేంద్రరెడ్డి, పొన్నం రవిచంద్ర, కేఎంకే రెడ్డి, డాక్టర్ సత్యనాథ్, డాక్టర్ అంకిరెడ్డి, సుబ్బరామిరెడ్డి, గఫార్, శ్రీమన్నారాయణ, మురళీకృష్ణరెడ్డి, గోపీనాథ్ పాల్గొన్నారు.

ఏసీ స్టేడియం వాకర్స్ ఆధ్వర్యంలో...



ఆత్మీయ సమావేశంలో ఏసీ స్టేడియం వాకర్స్

ఏసీ సుబ్బారెడ్డి స్టేడియం వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మాజీ అధ్యక్షుడు బాసం శేషగిరిరావు స్టేడియంలోని అన్ని సంఘాలను ఒకే వేదికపై తీసుకువచ్చి సంబరాలు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ 1998 నుంచి నేటి వరకు స్టేడియంలో నిత్యం వాకింగ్ చేస్తున్న వాకర్స్‌తో ఏర్పడిన స్నేహాలకు గుర్తుగా స్నేహితుల దినోత్సవం జరుపుకోవడం ఆనందంగా ఉందన్నారు. అనంతరం అందరికీ అల్పాహారాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో వివిధ వాకర్స్ సంఘాల నేతలు కిలారి తిరుపతినాయుడు, డీఏ.రామారావు, ఎస్.భక్తవత్సలరెడ్డి, రామ్మోహన్‌రెడ్డి, రాఘవరెడ్డి, నలుబోలు బలరామయ్యనాయుడు, నరసింహారెడ్డి, సురేంద్రబాబు తదితరులు పాల్గొన్నారు.

'దళితులకు అండగా ఉంటాం'

నెల్లూరు (సాంస్కృతికం), ఆగస్టు 4 : దళితులకు అండగా ఉండాలన్న లక్ష్యంతోనే సమతా సైనిక్‌దళ్ ఏర్పడిందని జిల్లా అధ్యక్షుడు బండి కిరణ్‌కుమార్ తెలిపారు. ఆదివారం ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడారు. రాష్ట్ర కమిటీ నియమించిన జిల్లా కమిటీ ద్వారా ప్రతి గ్రామం, మండల స్థాయిలో కమిటీలు ఏర్పాటు చేస్తామన్నారు. రాష్ట్రంలో ఎక్కడ దళితులకు ఇబ్బందులు ఉంటే తాము వారికి అండగా నిలుస్తామన్నారు. జిల్లా కార్యవర్గ కమిటీలో జిల్లా ప్రధాన కార్యదర్శిగా అనుపల్లి రాజసుందర్‌కుమార్, ఉపాధ్యక్షులుగా పచ్చ ప్రేమకుమార్, కొనుపర్తి సింహాద్రి, జిల్లా కార్యదర్శులు చెంతాటి అభిషేక్, జెడ్డా శంకర్, ఆర్గనైజింగ్ కార్యదర్శి నక్కా. సునీల్, తదితరులు ఎన్నికయ్యారని తెలిపారు.

విస్తృతంగా జనసేన క్రియాశీలక సభ్యత్వ నమోదు



సభ్యత్వ నమోదులో మల్లికార్జున యాదవ్

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట), ఆగస్టు 4: జిల్లా వ్యాప్తంగా జనసేన పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమం విస్తృతంగా చేపట్టామని ఆ పార్టీ కోర్ కమిటీ సభ్యుడు నూనె మల్లికార్జున యాదవ్ అన్నారు. ఆదివారం నెల్లూరు రూరల్ మండలంలోని కొత్తూరు సెంటర్ రామకోటయ్య నగర్ ప్రాంతంలో సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్‌పై ప్రజల్లో మంచి నమ్మకం ఉందని, అందుకే ఆయన ఎక్కడకి వెళ్లిన మంచి స్పందన లభిస్తుందన్నారు. ఆయనకు అండగా నిలవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని, భవిష్యత్తులో జనసేన పార్టీకి ప్రజలు సంపూర్ణ మద్దతు పలుకుతారని ఆశాభావం వ్యక్తం చేశారు. జనసేన పార్టీ జాతీయ మీడియా అధికార ప్రతినిధి వేములపాటి అజయ్‌కుమార్ సూచనల మేరకు ఈ కార్యక్రమం చేపట్టామన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ నాయకులు నాగరత్నం, హసీనా, ఇందిరా, శాంతి, సుకన్య, హజరత్, శివ, తదితరులు పాల్గొన్నారు.

మెగా రక్తదానం

నెల్లూరు(సాంస్కృతికం), ఆగస్టు 4 : నగరంలోని గణేష్ సేవా మిత్రమండలి 19వ వార్షికోత్సవ వేడుకలు సందర్భంగా ఆదివారం సేవా బ్లడ్ బ్యాంకులో మెగా రక్తదాన శిబిరం జరిగింది. సేవా మిత్ర మండలి సభ్యులు భారీ సంఖ్యలో పాల్గొని రక్తదానం చేశారు. ఈ సందర్భంగా సేవా రంగంలో విశేష సేవలు చేస్తున్న పరివార్ ఫౌండేషన్ చైర్‌పర్సన్ మాధవి, డాక్టర్ పసుపులేటి రమేష్, తదితరులను విశిష్ట సేవా పతకాలతో సత్కరించారు. ఈ కార్యక్రమాల్లో చైర్మన్ గాలి శ్రీధర్, కోవూరు రాజేష్, దండి సుమన్, ప్రసాద్, పెంచలయ్య, తదితరులు పాల్గొన్నారు.

ఉచిత కంటి వైద్య శిబిరం



రోగులకు పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

నెల్లూరు(సాంస్కృతికం), ఆగస్టు 4 : బాలాజీనగర్ సాయిదర్బార్ (అద్దాల మందిరం)లో ఆదివారం ఉచిత మెగా కంటి వైద్యశిబిరం జరిగింది. ఈ శిబిరంలో నెల్లూరు మోడరన్ కంటి వైద్యశాల అండ్ రీసెర్చ్ సెంటర్ వైద్యులు, సిబ్బంది రోగులను పరీక్షించారు. దాదాపు 500 మందికి కంటి వైద్య పరీక్షలు నిర్వహించారు. 90 మందిని కంటి ఆపరేషన్లుకు ఎంపిక చేశారు. వీరికి ఉచితంగా కంటి ఆపరేషన్లు చేయిస్తారు. ఈ వైద్య శిబిరంలో డాక్టర్ భారతి, డాక్టర్ చిన్మయి, డాక్టర్ వినీల, మేనేజర్ కుమార్‌స్వామి, సిబ్బంది పాల్గొనగా కార్యక్రమాలను మందిరం చైర్మన్ మధుసాయి, కమిటీ సభ్యులు పర్యవేక్షించారు.

సౌత్‌మోపూరులో..

నెల్లూరురూరల్ : మండలంలోని సౌత్‌మోపూరులో ఆదివారం బిగ్ టీవీ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. కిమ్స్, లియోడెంటల్, విజేత కంటి వైద్యశాలలకు చెందిన వైద్యులు, రోగులకు పరీక్షలు నిర్వహించారు. శస్త్ర చికిత్స అవసరమైన వారిని ఆసుపత్రులకు సిఫార్సు చేశారు. అనంతరం రోగులకు ఉచితంగా మందులు అందచేశారు.

అలరించిన మ్యూజికల్ నైట్

నెల్లూరు(సాంస్కృతికం), ఆగస్టు 4 : పేద కళాకారుల సహాయార్థం ఆదివారం రాత్రి వీఆర్సీ మైదానంలో జారీచాయిస్ ఆర్కెస్ట్రా అండ్ ఈవెంట్స్ ఆర్గనైజర్ రాజా ఆధ్వర్యంలో జరిగిన మెగా మ్యూజికల్ నైట్ అలరించింది. ప్రముఖ సినీ గాయకులు, ఆర్కెస్ట్రా కళాకారులు ఈ కార్యక్రమంలో పాల్గొని ఉర్రూతలూగించే పాటలు పాడడంతో యువత కేరింతలతో వీఆర్ హైస్కూల్ మైదానంలో మారుమోగాయి.

సమాజానికి మేలుకొలుపు భగవద్గీత : మంత్రి ఆనం



మంత్రి ఆనంతో గీత వైభవ్ ట్రస్ట్ నిర్వాహకులు

నెల్లూరు(సాంస్కృతికం), ఆగస్టు 4 : సమాజాన్ని మేల్కొలిపేది భగవద్గీత.. అలాంటి భగవద్గీత బోధన సమాజానికి చాలా అవసరమని రాష్ట్ర దేవదాయ ధర్మాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి తెలిపారు. ఆదివారం మంత్రిని ఆయన స్వగృహంలో గీతా వైభవన్ ట్రస్ట్ ఛైర్మన్ నజీర్‌బాషా మర్యాదపూర్వకంగా కలిశారు. భగవద్గీతను పాఠ్యాంశాలుగా పెట్టి విద్యార్థులకు బోధించాలని మంత్రిని కోరారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు జాలాది నాగేశ్వరరావు, సీహెచ్ ప్రసాద్, నరసాపురం ప్రసాద్ పాల్గొన్నారు.

జాషువా గ్రంథాలయం నిర్మాణ బాధ్యత నాదే !

● ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి

నెల్లూరు(సాంస్కృతికం), ఆగస్టు 4 : నిరుద్యోగ యువతకు విజ్ఞానం ఉపాధి కల్పించేలా గుర్రం జాషువా గ్రంథాలయాన్ని తీర్చిదిద్దే బాధ్యత తనదేనని నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి హామీ ఇచ్చారు. ఆదివారం ఆయన స్వగృహంలో గుర్రం జాషువా గ్రంథాలయ కమిటీ వర్కింగ్ ప్రెసిడెంట్ షేక్.ఖాసిం, ఆర్గనైజింగ్ కార్యదర్శి కొమ్మల కృష్ణయ్యలతో కమిటీ బృందం ఎంపీని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో శరత్‌బాబు, ఖాజామొహిద్దీన్, తదితరులు పాల్గొన్నారు.

అలరించిన సంగీత సంబరం



సాయి వేదవాగ్దేవిని సన్మానిస్తున్న నిర్వాహకులు

నెల్లూరు(సాంస్కృతికం), ఆగస్టు 4: నగరంలోని పురమందిరంలో ఆదివారం కళాంజలి సంగీత సంబరాలు అలరించాయి. కళాంజలి సంస్థ ఆధ్వర్యంలో ఉదయం నుంచి రాత్రి వరకు జూనియర్, సీనియర్స్ విభాగాల్లో అన్నమయ్య సంకీర్తనలు, సినిమా పాటల పోటీలు వీనులవిందు చేశాయి. రాత్రి పొడుతా తీయగా గాయనీగాయకులు సాయివేద వాగ్దేవి, జ్ఞానశ్రీ, అనూషా, గాయత్రి, అజిత్‌రామ్, శ్రీకృతిల చేసిన స్వరఝరి శ్రోతలను ఓలలాడించాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా లాయర్ సంపాదకులు తుంగా శివప్రభాతరెడ్డి, శుభమస్తు అధినేత బయ్యా రవికుమార్, విశ్వసాయి ఎడ్యుకేషనల్ ఛైర్మన్ డాక్టర్ ఎన్.సత్యనారాయణ, టౌనుహాలు ట్రస్ట్ బోర్డు సభ్యులు వాకాటి విజయకుమార్ రెడ్డి, ప్రపంచ తెలుగు సమాఖ్య రీజనల్ ఛైర్మన్ సభ్యులు బలరామయ్యనాయుడు, గౌరవాధ్యక్షులు వీరిశెట్టి హజరత్ బాబు, డాక్టర్ సర్వేపల్లి అజయ్‌కుమార్‌లు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో జీ లిటిల్ చాంప్స్ విజేత సాయివేద వాగ్దేవికి కళాంజలి అవార్డుతో సత్కరించారు.

ఆర్యవైశ్య పేదలకు పింఛన్ల పంపిణీ



పింఛను అందజేస్తున్న వేమిరెడ్డి విజయభాస్కర్‌రెడ్డి

నెల్లూరు(సాంస్కృతికం), ఆగస్టు 4 : నగరంలోని చిన్నబజారు ది నెల్లూరు ఆర్యవైశ్య బులియన్ మర్చంట్స్ అండ్ పాన్‌బ్రోకర్స్ అసోసియేషన్ కార్యాలయంలో ఆదివారం పేద ఆర్యవైశ్యులకు పింఛన్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా నారాయణ విద్యాసంస్థల జీఎం వేమిరెడ్డి విజయభాస్కర్‌రెడ్డి పాల్గొని పింఛన్, దుప్పట్లు, సంచులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్యవైశ్య బులియన్ మర్చంట్స్ 18 ఏళ్లుగా క్రమం తప్పకుండా నెలనెల పేద ఆర్య వైశ్యులకు పింఛన్లు ఇవ్వడం గొప్ప సేవ అని అభినందించారు. అనంతరం నూతనంగా ఎన్నికైన కార్యవర్గాన్ని అభినందించారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు కొనగళ్ల శోభన్‌బాబు, ప్రధాన కార్యదర్శి అరవేటి వెంకటఫణీంద్రకుమార్, కోశాధికారి భోగనాధం సుబ్రహ్మణ్యం, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



వైసీపీ హయాంలో నాయకుల చేతివాటం

- సచివాలయం, ఆర్బీకే నిర్మాణాల మెటీరియల్ స్వాహా
- పరిశ్రమల్లో రోడ్లకు, అపార్ట్‌మెంట్ నిర్మాణాలకు వాడేసిన వైనం

ప్రభుత్వ భవనాల నిర్మాణం కోసం తెప్పించిన మెటీరియల్‌ను వైసీపీ నాయకులు బొక్కేశారు. విచారణ జరిపి రికవరీ చేయాల్సిన అధికారులు మిన్నకుండిపోయారు.దీంతో భవన నిర్మాణాలు పునాదుల స్థాయిలోనే నిలిచిపోయాయి. - తడ

వైసీపీ ప్రభుత్వ హయాంలో సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు(ఆర్బీకే)లు, పాలకేంద్రాల కోసం భవన నిర్మాణాలకు అనుమతించడం అప్పటి అధికార పార్టీ నాయకులకు వరంగా మారింది. సచివాలయం, ఆర్బీకేలకు సుమారు రూ.65 లక్షలు, హెల్త్ సెంటర్, డెయిరీ నిర్మాణాల కోసం సుమారు రూ.35లక్షలను ప్రభుత్వం మంజూరు చేసింది. ఈ నిర్మాణాలను అప్పటి ప్రజా ప్రతినిధులు స్థానిక నాయకులకు అప్పగించారు. ఇక్కడే కొందరు నాయకులు చేతివాటం చూపి ఆ నిర్మాణాల కోసం వచ్చిన సిమెంట్, ఇసుక, ఇతర వస్తువులను స్వాహా చేశారు. తడ మండలం మాంబట్టు పంచాయతీ పరిధిలో 112 టన్నుల (2,240 బస్తాలు) సిమెంట్‌ను, సుమారు 150 యూనిట్ల ఇసుకను అధికారులు సరఫరా చేశారు. సచివాలయం పిల్లర్ల వరకు తీసుకురాగా, ఆర్బీకే పునాదులస్థాయిని దాటలేదు. పాలకేంద్రం, హెల్త్‌సెంటర్ నిర్మాణం ఊసేలేదు. వాస్తవంగా అక్కడ జరిగిన నిర్మాణాల కోసం 150 నుంచి 200 బస్తా సిమెంట్, 20 యూనిట్ల ఇసుక వినియోగించి ఉంటారనుకుంటే 500 బస్తాల సిమెంట్ వినియోగించినట్లుగా ఎంబుక్ నమోదు చేశారు. ఆ మేరకు నిర్మాణాల కోసం ఖర్చు అయినట్లుగా సుమారు రూ.4.50 లక్షలను డ్రా చేసేసుకున్నారు. మిగిలిన సుమారు రెండువేల బస్తాల సిమెంట్, 130 యూనిట్ల ఇసుక పక్కదారి పట్టినా పట్టించుకున్నవారు లేరు.

ఆగిపోయిన నిర్మాణాలు

- నాయుడుపేట మండలం విన్నమాలలో సచివాలయ నిర్మాణానికి అనుమతులు వచ్చాయి. పునాదుల స్థాయిలో వుండగా విన్నమాల పంచాయతీని నాయుడుపేట మున్సిపాలిటీలో విలీనం చేశారు. దాంతో విన్నమాలలో సచివాలయ నిర్మాణం నిలిపివేశారు. అప్పటికే నిర్మించిన బేస్‌మెంట్‌కు పోను మిగిలిన 800 బస్తాల సిమెంట్, ఇసుక నాయకులు స్వాహా చేసినా అధికారులకు కనబడలేదు.
- దొరవారిసత్రం మండలం ఉచ్చూరులో సచివాలయం, ఆర్బీకేల నిర్మాణం కోసం 500 బస్తాల సిమెంట్‌ను అధికారులు మంజూరు చేయగా, ఆ నిర్మాణం గుంతలస్థాయిలోనే నిలబడిపోయింది. మంజూరైన 500 బస్తాల సిమెంట్‌ను నాయకులు పక్కదారి పట్టించేశారు.

ప్రైవేట్ నిర్మాణాలకు వాడేశారు

పునాదుల స్థాయిలోనే నిలిచిన విన్నమాల సచివాలయ భవనం

పక్కదారిపట్టిన మెటీరియల్‌ను నాయకులు సొంత అవసరాలకు వాడుకున్నారు. తడ మండలం మాంబట్టులో పక్కదారి పట్టిన సుమారు 2వేల బస్తాల సిమెంట్, 130 యూనిట్ల ఇసుకతో సెజ్‌లోని ఓ పరిశ్రమకు సుమారు 10 లక్షల రూపాయలతో రోడ్డు వేశారు. అలాగే అక్కడే ఓ పరిశ్రమ 12 లక్షల రూపాయల సీఎస్ఆర్ నిధులతో నిర్మించతలపెట్టిన అంగన్‌వాడీ భవనాన్ని కాంట్రాక్ట్ తీసుకొని కొందరు చోటానాయకులు ఈ ప్రభుత్వ మెటీరియల్‌తో నిర్మించి సొమ్ము చేసుకున్నారు. మిగిలిన మెటీరియల్‌ను సూళ్లూరుపేటలోని ఒక ప్రైవేట్ ఇంటికి వినియోగించారు. ప్రస్తుత ప్రభుత్వం విచారణ జరిపిస్తే ఇలాంటి గోల్‌మాల్ వ్యవహారాలు బయటపడే అవకాశముంది. పక్కదారి పట్టిన లక్షల రూపాయల విలువైన మెటీరియల్‌ను రికవరీ చేయవచ్చు.



సైబర్ నేరగాళ్లు దొరక్కుంటే కేసులు క్లోజ్!

- బాధితులకు న్యాయం జరక్క అల్లాడుతున్న వైనం

తిరుపతి(నేరవిభాగం), ఆగస్టు 4: సైబర్ కేసుల్లో నేరగాళ్ల దొరక్కుంటే అటువంటివి క్లోజ్ చేస్తున్నారన్న విమర్శలున్నాయి. దీంతో బాధితులకు న్యాయం జరక్క అల్లాడిపోతున్నారు. ప్రతి రోజూ నమోదవుతున్న కేసుల్లో 30 శాతం మందికి మాత్రమే న్యాయం జరుగుతోంది. మిగిలిన కేసుల్లో నేరగాళ్లను అధికారులు గుర్తించలేక మిన్నకుండిపోతున్నారు. జిల్లాలో సైబర్ నేరాలు పెరిగిపోతుండడంతో 2019లో తిరుపతి కేంద్రంగా జిల్లా సైబర్ క్రైం వ్యవస్థను ఏర్పాటు చేశారు. ఇది పూర్తిస్థాయిలో అమల్లోకి వచ్చింది మాత్రం 2021 నుంచే. అంటే మూడున్నరేళ్లుగా ఈ వ్యవస్థ పనిచేస్తోంది.అయితే ఇక్కడ పటిష్ఠమైన వ్యవస్థ ఉందా.. అంటే లేదనే సమాధానం వినిపిస్తోంది.



సైబర్ క్రైంపై అవగాహన వాల్‌పోస్టర్

వందల్లో కేసులు.. పదుల్లో రికవరీ

జిల్లా పరిధిలో ఏటా వందలాది కేసులు నమోదవుతున్నాయి. ఇందులో కేవలం పదుల సంఖ్యలో మాత్రం బాధితులకు న్యాయం జరుగుతోంది. అధికారిక గణాంకాల ప్రకారం 2019లో 109 కేసులు నమోదయ్యాయి. ఇందులో 30 కేసులు మాత్రమే బాధితులు పోగొట్టుకున్న నగదు రికవరీ చేయించారు. 2020లో 128 కేసులు, 2021లో 220 కేసులు నమోదవగా ఇందులో 25 నుంచి 30 శాతం కేసుల్లో మాత్రమే బాధితులు పోగొట్టుకున్న నగదును రికవరీ చేయించారు. 2022 నుంచి 2024 జూలై 25వ తేదీవరకు 471 కేసులు నమోదవగా 30 శాతం కేసుల్లో మాత్రమే పోలీసులు నిందితులను అరెస్టు చేసి.. బాధితులకు న్యాయం చేయగలిగారు. ఇక ఐదేళ్ల కాలంలో బాధితులు రూ.15కోట్లకుపైగా సైబర్ నేరగాళ్ల బారిన పడి మోసపోగా, ఇప్పటివరకు రూ.3.80 కోట్లను మాత్రమే రికవరీ చేసినట్లు అధికారిక గణాంకాలు చెబుతున్నాయి.

గోల్డెన్ అవర్‌లోనే ఫిర్యాదు చేయాలి

బాధితులు గంట (గోల్డెన్ అవర్)లోనే సైబర్ క్రైంకు ఫిర్యాదు చేయాలి. అపుడే పోగొట్టుకున్న నగదు తిరిగి వచ్చే అవకాశం ఉంటుంది. దీనికోసం 1930 నెంబరుకు ఫోన్ చేయాలి.

- వినోద్‌కుమార్, సైబర్ క్రైం సీఐ

మిస్టరీగానే కేసులు

జిల్లా వ్యాప్తంగా రోజుకు కనీసం 5 నుంచి 10 కేసులు నమోదవుతున్నాయి. సెల్‌ఫోన్ నెంబరు, బ్యాంకు ఖాతా, పాన్ లేదా ఆధార్ నెంబరు ఉంటేనే పోలీసులు కూడా నిందితులను పట్టుకోవడానికి ప్రయత్నిస్తున్నట్లు సమాచారం. అందువల్ల 85 శాతం కేసుల్లో నిందితులు చిక్కక మిస్టరీగానే ఉంటున్నాయి. బాధితులేమో స్టేషన్ల చుట్టూ తిరగాల్సి వస్తోంది.

ఉపాధి కూలీల ఆకలి కేకలు

- కూలి చెల్లింపులు రూ.70 కోట్ల వరకు ఆగిపోవడమే కారణం



ఉపాధి పనులు చేస్తున్న కూలీలు (ఫైల్ ఫొటో)

కోట, ఆగస్టు 4: ఉపాధి హామీ పథకం కింద పని చేసే కూలీలు ఆకలితో అలమటిస్తున్నారు. వీరికి రావాల్సిన రూ.70 కోట్ల వరకు కూలి చెల్లించక పోవడమే దీనికి కారణం. జిల్లాలోని 33 మండలాల్లో లక్షలాదిమంది కూలీలకు పది వారాలుగా కూలి చెల్లింపులు నిలిపివేశారు. చేసిన పనులకు నగదు ఎప్పుడిస్తారని ఉపాధి సిబ్బంది చుట్టూ కూలీలు రోజూ తిరుగుతూనే ఉన్నారు. కూలీలకు సమాధానం చెప్పలేక సిబ్బంది కూడా సతమతమవుతున్నారు. ఈ ఏడాది మే రెండో వారం వరకు డ్వామా అధికారులు.. కూలీలకు నగదు చెల్లించారు. తర్వాత చెల్లింపులు జరగలేదు. కొన్ని మండలాల్లో 10 వారాలు, మరికొన్ని మండలాల్లో 12 వారాలపాటు నిలిపేసినట్లు తెలిసింది. ప్రధానంగా కోట, వాకాడు, చిట్టమూరు, చిల్లకూరు మండలాల్లోని కూలీలైతే తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. ఇకనైనా సంబంధిత అధికారులు స్పందించి కూలి డబ్బులు చెల్లించాలని కూలీలు కోరుతున్నారు. దీనిపై డ్వామా పీడీ శ్రీనివాస ప్రసాద్ మాట్లాడుతూ.. ఉపాధి కూలీలకు చెల్లింపులు నిలిపివేసింది వాస్తవమే అన్నారు. మరో వారం రోజుల్లో జిల్లావ్యాప్తంగా కూలీలకు వారి బ్యాంకు ఖాతాలో కూలి డబ్బు జమ చేస్తామన్నారు.

ముక్కంటి రాహు-కేతు పూజల్లో రికార్డు

|| ఆదివారం ఒక్కరోజే 9,168 టిక్కెట్ల విక్రయాలు ||

శ్రీకాళహస్తి, ఆగస్టు 4: శ్రీకాళహస్తీశ్వరాలయంలో ఆదివారం రాహు-కేతు పూజల సంఖ్య ఆల్‌టైం రికార్డుగా నమోదైంది. ఆలయంలో ఐదు రకాల ధరల టిక్కెట్లపై వేర్వేరుగా రాహు-కేతు సర్పదోష నివారణ పూజలు జరిగే విషయం తెలిసిందే. 14 నెలల కిందట ఐదు రకాల టిక్కెట్లు 7,200 అమ్ముడు కావడం రికార్డుగా నమోదైంది. తాజాగా ఆషాడ అమావాస్య ఆదివారం కలిసి రావడంతో ఈ ఒక్కరోజే 9,168 రాహుకేతు పూజా టిక్కెట్లు అమ్ముడై సరికొత్త రికార్డుగా నమోదైంది. ఉదయం నుంచి సాయంత్ర వరకు ముక్కంటి ఆలయంలోని రాహుకేతు మండపాలు భక్తుల రద్దీతో కిక్కిరిసిపోయాయి.

ఐదు రకాల టిక్కెట్ల వివరాలిలా..

రూ.500 టిక్కెట్లు 5,183, రూ.750.. 2,288, రూ.1,500.. 933, రూ.2,500.. 610, రూ.5వేల టిక్కెట్లు 154 కలిపి మొత్తం 9,168 రాహుకేతు పూజలు జరిగినట్లు ఈవో ఎస్‌వీఎస్ఎస్ మూర్తి తెలిపారు. అలాగే ఐదు రకాల ప్రసాదాలు 29,505 ప్యాకెట్లు విక్రయం జరగడంతో ఈ సంఖ్య కూడా రికార్డుస్థాయికి దగ్గరగా నమోదైంది. కాగా, ఆదివారం ఒక్కరోజే వివిధ పూజలు, సేవలు టిక్కెట్ల ద్వారా ఆలయానికి రూ.1.95కోట్లు వచ్చిందని ఈవో చెప్పారు.



రూ.500 రాహు-కేతు పూజా మండపం వద్ద బారులు తీరిన భక్తులు



ప్రజల సొమ్ముతో వైసీపీ నాయకుల జల్సాలు

- తిరుపతి కార్పొరేషన్‌లో రూ.3కోట్ల స్కామ్
- పనిచేయకనే 90మందికి జీతాల చెల్లింపు: జనసేన

తిరుపతి (జీవకోన), ఆగస్టు 4: ప్రజల సొమ్ముతో గత ప్రభుత్వంలో వైసీపీ నాయకులు జల్సాలు చేశారని తిరుపతి జనసేన ఇన్‌చార్జి కిరణ్ రాయల్ మండిపడ్డారు. ఆదివారం తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో మీడియాతో మాట్లాడుతూ.. తిరుపతి కార్పొరేషన్‌లో రూ.3కోట్లు స్నాక్స్ స్కామ్ జరిగిందని తెలిపారు. గత ప్రభుత్వంలో అన్నీతానై వ్యవహరించిన అప్పటి డిప్యూటీ మేయర్ అభినయ్‌రెడ్డి, వైసీపీ కార్పొరేటర్లు ప్రజలకు చేసిందేమీ లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎపుడో ఓసారి మీటింగ్ పెట్టుకుని రూ.3కోట్లు స్నాక్స్ రూపంలో ఖర్చు పెట్టారని స్వయానా వైసీపీ కార్పొరేటర్లే చెప్పిన విషయాన్ని గుర్తుచేశారు. కొందరేమో రూ.38లక్షలు అంటారు.. మరికొందరు అధికారులేమో రూ.1.50 అంటారు.. మొత్తానికి రూ.3కోట్లు సమోసాల పేరుతో తినేశారని ఆరోపించారు. మరోపక్క 90మందిని కార్పొరేషన్‌లో నియమించుకున్నట్లు తప్పుడు లెక్కలు చూపి వారికి 25 నెలలపాటు జీతాల పేరుతో సొమ్మును దిగమింగారని చెప్పారు. మనుషులే పనిచేయని చోట జీతాలు ఎలా చెల్లించారంటూ ప్రశ్నించారు. కార్పొరేషన్‌లోని ప్రతి అధికారి ఇంట్లో ఇద్దరు మనుషులను పెట్టుకుని వారి సొంత పనులకు వినియోగించుకుని ప్రజల సొమ్ముతో జీతాలు చెల్లించారన్నారు. అదే విధంగా డబుల్ డెక్కర్ బస్సును రూ.2కోట్లు పెట్టి కొనుగోలు చేశారని.. ప్రస్తుతం ఆ బస్సు గోవిందధామం పక్కన పాత వాహనాల మధ్యలో పెట్టేశారన్నారు. ఈ బస్సు కోసం నగరంలోని పచ్చని చెట్లను సైతం నరికేశారని ఆవేదన వ్యక్తం చేశారు. వీటన్నింటిపై వెంటనే విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు వినోద్, సుమన్‌బాబు, కిషోర్, మనోజ్, ఆది, పవన్, సుమంత్, రాజేంద్ర,సిద్ధు, లోకేష్, భాను తదితరులు పాల్గొన్నారు.



మీడియాతో మాట్లాడుతున్న కిరణ్‌రాయల్



గ్యాలరీలను పరిశీలిస్తున్న అదనపు ఈవో వెంకయ్యచౌదరి

శ్రీవారి మాడవీధుల్లో తనిఖీలు

తిరుమల, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): తిరుమలలోని శ్రీవారి ఆలయ నాలుగు మాడవీధుల్లోని గ్యాలరీలను టీటీడీ అదనపు ఈవో వెంకయ్య చౌదరి ఆదివారం తనిఖీ చేశారు. శ్రీవారి వార్షిక బ్రహ్మోత్సవాలు అక్టోబరు 4 నుంచి 12వ తేదీ వరకు జరుగనున్న నేపథ్యంలో మాడవీధుల్లో ఉన్న వివిధ ప్రవేశ, నిష్క్రమణ, హారతి పాయింట్ల గురించి తెలుసుకోవడానికి అన్ని గ్యాలరీలను క్షుణ్ణంగా తనిఖీ చేశారు.వాహన మండపం నుంచి ప్రారంభమై నాలుగు మాడవీధుల్లోని గ్యాలరీలు,తిరుమలనంబి ఆలయం వద్ద కదిలే వంతెన,గ్యాలరీల వద్ద ప్రవేశ నిష్క్రమణ పాయింట్లు, ఇతర సంబంధిత సమాచారాన్ని అధికారులను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో డిప్యూటీ ఈవో లోకనాథం, వీజీవో నందకిషోర్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

అమరావతికి కలెక్టర్ పయనం

నేడు సీఎం కాన్ఫరెన్స్‌లో జిల్లా స్థితిగతులపై నివేదన

తిరుపతి(విద్య), ఆగస్టు 4: కలెక్టర్ వెంకటేశ్వర్ ఆదివారం రాష్ట్ర రాజధాని అమరావతికి బయల్దేరి వెళ్లారు. కలెక్టర్లు, ఎస్పీలు, ఆయా శాఖల కార్యదర్శులు, మంత్రులతో వెలగపూడిలోని సచివాలయంలో సోమవారం కాన్ఫరెన్స్ జరగనుంది. సీఎం చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ వీరితో సమావేశం కానున్నారు. రాష్ట్రంలో కొత్త ప్రభుత్వం కొలువుదీరాక తొలిసారిగా ఉన్నతాధికారులు, మంత్రులతో ముఖ్యమంత్రి భేటీ కానున్నారు. దీంతో ఈ సమావేశానికి ప్రాధాన్యం సంతరించుకుంది. ఈ సందర్భంగా.. గత ప్రభుత్వ నిర్ణయాలు, తద్వారా ఆయా జిల్లాల్లో నెలకొన్న పరిస్థితులపై కలెక్టర్లు, ఎస్పీలద్వారా సమాచారాన్ని తీసుకుని సమీక్షిస్తారు. ప్రభుత్వ ప్రాధాన్యాలు, లక్ష్యాలను అధికారులకు వివరించి, వాటిని సాధించేందుకు అనుసరించాల్సిన విధి విధానాలపై సూచనలు చేయనున్నారు. గత ప్రభుత్వ హయాంలో వ్యవస్థలన్నీ నిర్వీర్యం అయిపోయిన నేపథ్యంలో గాడిలో పెట్టేందుకు తీసుకోవాల్సిన చర్యలపై అధికారులు, మంత్రులతో ముఖ్యమంత్రి చర్చించనున్నారు. ఈ నేపథ్యంలో మన జిల్లాలో వ్యవస్థల తీరు, గత ప్రభుత్వ నిర్ణయాలతో జరిగిన నష్టాలు, తీసుకోవాల్సిన చర్యలు తదితర అంశాలపై కలెక్టర్ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లేందుకు ఏర్పాట్లు చేసుకున్నట్టు తెలుస్తోంది.

కలెక్టరేట్‌లో నేడు యథావిధిగా పీజీఆర్ఎస్

కలెక్టరేట్‌లో సోమవారం ప్రజాఫిర్యాదుల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) యథావిధిగా జరుగుతుంది. జనం నుంచి అర్జీలను అధికారులు స్వీకరిస్తారు.



శ్రీనివాస వర్మ, ఆరణిలను సన్మానిస్తున్న నాయకులు

రాష్ట్రాభివృద్ధిపై కేంద్రం ప్రత్యేక దృష్టి

- కేంద్రమంత్రి శ్రీనివాసవర్మ

తిరుపతి(ఉపాధ్యాయనగర్), ఆగస్టు 4: రాష్ట్రాభివృద్ధిపై కేంద్రం ప్రత్యేక దృష్టి పెట్టిందని కేంద్ర ఉక్కు, భారీ పరిశ్రమల శాఖ సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ తెలిపారు. శ్రీవారి దర్శనార్థం శనివారం ఆయన తిరుమలకు వచ్చారు. దర్శనానంతరం ఆదివారం ఆయన పుట్టిన రోజు వేడుకలను స్థానిక ప్రైవేటు హోటల్లో బీజేపీ శ్రేణులు ఘనంగా నిర్వహించాయి. ఈ సందర్భంగా జరిగిన సమావేశానికి ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు హజరై కేంద్రమంత్రికి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం శ్రీనివాస వర్మ మాట్లాడుతూ.. రాష్ట్రంలో పారిశ్రామికాభివృద్ధి పరుగులు తీయిస్తామని చెప్పారు. అవసరమైన నిధులన్నింటినీ కేంద్రం అందజేస్తుందన్నారు. బీజేపీ కార్యకర్తలను ఉద్దేశించి మాట్లాడుతూ. కష్టపడి పనిచేసేవారికి పార్టీ సముచిత స్థానం లభిస్తుందని చెప్పడానికి తానే ఓ ఉదాహరణ అన్నారు. నాయకులు భానుప్రకాష్‌రెడ్డి, కోలా ఆనంద్, జల్లి మధుసూదన్, చంద్రప్ప, వరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

87 ప్రైవేటు ల్యాబులకు నోటీసులు

[ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్]

తిరుపతి(వైద్యం), ఆగస్టు 4: జిల్లాలో నిబంధనలు పాటించకుండా నిర్వహిస్తున్న 87 ప్రైవేటు ల్యాబులను గుర్తించి, వాటికి నోటీసులు జారీ చేసినట్లు డీఎంహెచ్‌వో శ్రీహరి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ అంశంపై శుక్రవారం ఆంధ్రజ్యోతిలో 'ప్రైవేటు ల్యాబుల దందా' శీర్షికన కథనం ప్రచురితమైన విషయం తెలిసిందే. స్పందించిన డీఎంహెచ్‌వో.. 17 ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి, రెండ్రోజులుగా జిల్లా వ్యాప్తంగా ఉన్న ప్రైవేటు ల్యాబులను తనిఖీ చేశారు. రిజిస్ట్రేషన్, నిబంధనలు పాటించని 87 ల్యాబులను గుర్తించి, నోటీసులిచ్చారు. వారం రోజుల్లోపు నిబంధనల మేరకు రిజిస్ట్రేషన్ తదితరాలను పూర్తిచేయాలని ఆదేశించారు. అప్పటికీ నిబంధనలు పాటించని ప్రైవేటు ల్యాబులను శాశ్వతంగా మూయించేస్తామని డీఎంహెచ్‌వో పేర్కొన్నారు.

గంజాయి అమ్మకాలపై ప్రత్యేక నిఘా



సిబ్బందికి సూచనలు ఇస్తున్న డీఎస్పీ సూర్యనారాయణరెడ్డి

గూడూరు, ఆగస్టు 4: గంజాయి అమ్మకాలను నియంత్రించేందుకు ప్రత్యేక నిఘా ఉంచామని డీఎస్పీ సూర్యనారాయణరెడ్డి అన్నారు. ఆదివారం స్థానిక అరుంధతీయపాళెంలో పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో కార్డెన్‌సర్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగా పలు అనుమానిత ప్రాంతాల్లో కార్డెన్‌సర్చ్ నిర్వహిస్తున్నామన్నారు. ఎవరైనా కొత్తవ్యక్తుల సంచారం ఉంటే పోలీస్‌శాఖకు ప్రజలు సమాచారం అందించాలన్నారు. అసాంఘిక కార్యకలపాలకు పాల్పడే వారిపై రౌడీషీట్ తెరుస్తామన్నారు. గంజాయి విక్రయాలు చేపట్టి పట్టుబడితే రెండు కేసులు, ఎక్కువ నమోదు అయిన వారిపై పీడీయాక్ట్ నమోదు చేస్తామన్నారు. చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే ఉపేక్షించేది లేదన్నారు. కార్యక్రమంలో పట్టణ సీఐ పాపారావు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

దుస్తులు, ఆహార పొట్లాల పంపిణీ



గూడూరు అర్బన్, ఆగస్టు 4: స్థానిక ప్రగతి సేవాసంస్థ కార్యాలయంలో ఆదివారం మహిళలకు దుస్తులు, ఆహార పొట్లాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కే.చంద్రశేఖర్, సురేష్‌రెడ్డి, రాము, శ్రీనివాసులు, నాగరాజు, సతీష్ తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా పట్టణంలోని పలు ఆలయాల వద్ద నిరుపేదలకు పోటుపాళెం మాజీ ఎంపీటీసీ వాకాటి ప్రభాకర్, గురుస్వామి, మధు ఆధ్వర్యంలో ఆహార పొట్లాలను పంపిణీ చేశారు.

ఉపాధ్యాయ వృత్తి పవిత్రమైనది

● మాజీ ఎమ్మెల్సీ విఠపు బాలసుబ్రహ్మణ్యం



వేణుగోపాల్ దంపతులను అభినందిస్తున్న విఠపు, ఉపాధ్యాయులు

కోట, ఆగస్టు 4 : ఉపాధ్యాయ వృత్తి ఎంతో పవిత్రమైనదని మాజీ ఎమ్మెల్సీ విఠపు బాలసుబ్రహ్మణ్యం అన్నారు. కోట పట్టణం లోని రెడ్డి సంక్షేమ భవన్‌లో ఆదివారం చిట్టమూరు మండలం మల్లాంలో గణిత ఉపాధ్యాయుడుగా పనిచేస్తూ పదవీ విరమణ పొందిన ఈదూరు వేణుగోపాల్‌కు యూటీఎఫ్ ఆధ్వర్యంలో అభినందన కార్యక్రమాలు జరిగాయి. ఈ సందర్భంగా విఠపు బాలసుబ్రహ్మణ్యంతోపాటు పలువురు ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ జిల్లా, రాష్ట్రస్థాయి నాయకులు వేణుగోపాల్ దంపతులను పూలమాలలు, శాలువాలతో అభినందించారు. కార్యక్రమంలో యూటీఎఫ్ నాయకులు మనోహర్, మస్తానయ్య, రాజ్‌కుమార్‌లతోపాటు రాజశేఖర్, ముత్యాలురెడ్డి, చలపతి, నిర్మల, శేఖర్, బాబురెడ్డి, ఎస్ఎస్‌నాయుడు, నవకోటేశ్వరరావు, చంద్రశేఖర్, పరంధామయ్య తదితరులు ఉన్నారు.

పేద విద్యార్థులకు నగదు పురస్కారాలు



కోట, ఆగస్టు 4 : ప్రతిభా పాఠవాలు కలిగిన ప్రతి విద్యార్థికి అండగా ఉంటామని షిరిడీసాయి అక్షయ సేవాసమితి అధ్యక్షుడు అల్లం రమణయ్య హామీ ఇచ్చారు. కోటలోని కోటమ్మ ఆలయ ప్రాంగణంలో ఆదివారం ప్రతిభా పాఠవాలు కలిగిన ఉమ్మడి నెల్లూరు, తిరుపతి జిల్లాలలోని పేద విద్యార్థులకు నగదు పురస్కారాలు జరిగాయి. 10వ తరగతి, ఇంటర్, ఇంజనీరింగ్‌లలో ఉన్న పేద విద్యార్థులకు సుమారు 40 మందికి నగదు అందజేశారు. ముగ్గురు నిరుపేద మహిళలకు మూడు కుట్టుమిషన్‌లు, ఇద్దరు దివ్యాంగులకు రెండు ట్రై సైకిళ్లు, ఒక విద్యార్థికి ల్యాప్‌టాప్‌ను అందజేశారు. అనంతరం 5 మంది రిటైర్డ్ ఉపాధ్యాయులను షీల్డులతో అభినందించారు. ప్రముఖ సైకాలజిస్టు కర్లపూడి కృష్ణయ్య విద్యార్థులకు ఏకాగ్రతపై అవగాహన కల్పించారు.

మోమిడిలో క్రికెట్ పోటీలు

చిల్లకూరు, ఆగస్టు 4: మండలంలోని మోమిడిలో శశికుమార్, శేషేంద్ర జ్ఞాపకార్థం స్థానిక యువత ఆధ్వర్యంలో జిల్లాస్థాయి క్రికెట్ పోటీలు ఆదివారం జరిగాయి. మొదటి మ్యాచ్ కొత్తపట్నం-జిందాల్ జట్ల మధ్య జరిగింది. మొదట బ్యాటింగ్ చేసిన కొత్తపట్నం 10ఓవర్లలో 6 వికెట్లకు 93 పరుగులు చేసింది. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన జిందాల్ జట్టు 10 ఓవర్లలో 6 వికెట్లకు 96పరుగులు చేసి విజయం సాధించింది. రెండో మ్యాచ్ చింతవరం-గోపాలపురం జట్ల మధ్య జరిగింది. మొదట బ్యాటింగ్ చేసిన చింతవరం జట్టు 8.4 ఓవర్లలో 38 పరుగులు చేసి ఆలౌట్ అయింది. అనంతరం బ్యాటింగ్ చేసిన గోపాలపురం జట్టు 3.2 ఓవర్లలో 7 వికెట్లకు 39 పరుగులు చేసి గెలుపొందింది. మూడో మ్యాచ్ మోమిడి- రొయ్యలపాళెం జట్ల మధ్య జరిగింది. మొదట బ్యాటింగ్ చేసిన మోమిడి జట్టు 10 ఓవర్లలో 7 వికెట్లకు 78 పరుగులు చేసింది. అనంతరం బ్యాటింగ్ చేసిన రొయ్యలపాళెం జట్టు 9 ఓవర్లలో 7 వికెట్లకు 84 పరుగులు చేసి విజయం సాధించింది.

వరిలో తెల్ల కంకుల బెడద



సగానికి పైగా పోయిన తెల్ల కంకులు

పెళ్లకూరు, ఆగస్టు 4 : మండలంలో వరి రైతులను తెల్ల కంకుల బెడద వేధిస్తోంది వరి కంకులు తెల్లబడి పోతుండడంతో దిగుబడి తగ్గిపోతోందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ ఖరీఫ్‌లో పసుపుకండ్రిగ, నెలబల్లి, కొత్తూరు, అనకవోలు, పెరుమాళ్లపల్లి, కప్పగుంటకండ్రిగ తదితర గ్రామాల్లో రైతులు 702 ఎకరాలలో వరి సాగు చేశారు. ప్రస్తుతం 250 ఎకరాలకుపైగా కోతలు ప్రారంభమయ్యాయి. పొట్ట, వెన్ను దశలో ఉన్న వరిలో ఉధృతంగా తెల్ల కంకులు ఉండడంతో పంట దిగుబడులపై పెనుప్రభావం చూపుతుందని రైతులు వాపోతున్నారు. ఈ సందర్భంగా మండల వ్యవసాయాధికారిణి గొడవర్తి ప్రవీణ మాట్లాడుతూ రైతులు రసాయనిక ఎరువులు మోతాదుకు మించి వాడడంతో చీడ పీడలు ఆశించే అవకాశం ఎక్కువగా ఉంటుందని, సస్యరక్షణ చర్యలతో పంటలను కాపాడుకోవచ్చునని అన్నారు.

ముత్యాలమ్మకు పూజలు



చిల్లకూరు, ఆగస్టు 4: మండలంలోని తూర్పుకనుపూరులో వెలసిన ముత్యాలమ్మ అమ్మవారికి ఆదివారం ప్రత్యేక పూజలు జరిగాయి. భక్తులు ఆలయం వద్ద పొంగళ్లు పెట్టి నైవేద్యం నివేదించి అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయం ఎదుట ఉన్న త్రిశూలం వద్ద టెంకాయలు కొట్టి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం తీర్థప్రసాదాలు స్వీకరించారు.

తాళమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు



గూడూరు, ఆగస్టు 4: గూడూరు గ్రామదేవత తాళమ్మ ఆలయంలో ఆదివారం అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. తాళమ్మ అమ్మవారిని వివిధ రకాల పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించారు. పట్టణ, సమీప ప్రాంతాల నుంచి భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ ఆవరణంలో పొంగళ్లు పెట్టుకుని మొక్కులు తీర్చుకున్నారు.

అమావాస్య ప్రత్యేక పూజలు



నాయుడుపేట టౌన్, ఆగస్టు 4 : మండలంలోని చలివేంద్రం వద్ద వెలసిన వైద్య వీరరాఘవులస్వామి ఆలయంలో ఆదివారం అమావాస్య ప్రత్యేక పూజలు నిర్వహించారు. వీరరాఘవులస్వామిని ప్రత్యేక పుష్పాలతో అలంకరించారు. ఆదివారం ఆడి అమావాస్య 65 సంవత్సరాలకు ఒకసారి వచ్చేటువంటి అమావాస్య కావడంతో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని వీరరాఘవులస్వామిని దర్శించుకున్నారు. అంతకుముందు ఉదయం పంచామృతాభిషేకాలు నిర్వహించారు. మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఆలయ ధర్మకర్త అమ్మణ్ణమ్మ, భక్తులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఆపరేటర్ పోస్టులకు ఇంటర్వ్యూలు

కోట, ఆగస్టు 4 : స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో నియోలింక్ సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం కోట, వాకాడు, చిట్టమూరు మండలాలకు చెందిన నిరుద్యోగులకు ఇంటర్వ్యూలు జరిగాయి. శ్రీసిటీలో ఖాళీగా ఉన్న ఆపరేటర్ పోస్టులకు సంబంధించి ఇంటర్వ్యూలు నిర్వహించారు. నియోలింక్ సంస్థ ప్రతినిధులు ఆయా ఉద్యోగాలకు సంబంధించి ఎంపికైన నిరుద్యోగులకు పలు సూచనలు, సలహాలు ఇచ్చారు.

తల్లిపాలు ఆరోగ్యవంతం

గూడూరు, ఆగస్టు 4: పుట్టినబిడ్డకు మొదటి ఆరు నెలలు క్రమం తప్పకుండా తల్లిపాలు ఇస్తే చిన్నారులు ఆరోగ్యవంతంగా ఉంటారని డాక్టర్ తనూజ అన్నారు. ఆదివారం స్థానిక సరస్వతి శిశుమందిరంలో ఇన్నర్‌వీల్ క్లబ్ ఆధ్వర్యంలో బాలింతలకు పౌష్టికాహారాన్ని అందజేశారు. ఆమె మాట్లాడుతూ తల్లిపాలలో రోగనిరోధకశక్తి ఉంటుందన్నారు. బాలింతలు పోషక విలువలతో కూడిన ఆహారాన్ని తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో మెహబూబి, అనిత, స్నేహలత తదితరులు పాల్గొన్నారు.

ఎంపీ వేమిరెడ్డికి సన్మానం



గూడూరు, ఆగస్టు 4: నెల్లూరులోని ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి కార్యాలయంలో ఆదివారం గూడూరుకు చెందిన బ్రాహ్మణ సేవాసంఘ సమాఖ్య నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి ఎంపీని సన్మానించారు. ఈ సందర్భంగా సమాఖ్య నాయకులు మాట్లాడుతూ గూడూరులో బ్రాహ్మణ సేవాసంఘ సమాఖ్య భవన నిర్మాణానికి ఎంపీ సహకారం అందించడంతో ఆయనను కలిసి సన్మానించామన్నారు. కార్యక్రమంలో శిరోమణిశర్మ, శివకుమార్, శ్రీనివాసరావు, నరసింహారావు, కమలకుమారి, గాయత్రి పాల్గొన్నారు.

తడలో నేత్రదానం



వెంకటరత్నం రెడ్డి (ఫైల్)

తడ, ఆగస్టు 4 : తడలో ఆదివారం 440వ నేత్రదానం నమోదైంది. మాంబట్టు గ్రామానికి చెందిన కాకు వెంకటరత్నంరెడ్డి(84) అనారోగ్యంతో మృతి చెందారు. దీంతో కుటుంబసభ్యులు ఆయన నేత్రాలను దానం చేయాలని నిర్ణయించి ఆ మేరకు సూళ్లూరుపేటకు చెందిన ఆచార్య భరద్వాజా సేవాసంస్థకు సమాచారం అందించారు. వారి సహకారంతో చెన్నై శంకర్ నేత్రాలయ్య ఆసుపత్రి వైద్యులు వెంకటరత్నంరెడ్డి కంటిలోని రెటీనాను సేకరించారు. ఆచార్య భరద్వాజా సేవాసంస్థ ఆధ్వర్యంలో ఇది 440వ నేత్రదానం అని సంస్థ సభ్యులు మన్నెముద్దు శ్రీనివాసులు తదితరులు తెలిపారు.

రైలు కిందపడి వ్యక్తి ఆత్మహత్య



గూడూరు అర్బన్, ఆగస్టు 4: స్థానిక రైల్వేస్టేషన్ సమీపంలో రైలుపట్టాలపై ఆదివారం ఓ వ్యక్తి మృతిచెంది ఉండటాన్ని రైల్వేసిబ్బంది గుర్తించి రైల్వే జీఆర్ పోలీసులకు సమాచారం అందించారు. స్థానిక ఇందిరమ్మ కాలనీకి చెందిన నాగూర్(46) చిన్నపాటి పనులు చేసుకుని జీవన సాగిస్తుంటాడు. కుటుంబ కలహాల నేపథ్యంలో మనస్థాపానికి లోనైన నాగూర్ రైలు కిందపడి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ మేరకు రైల్వేజీఆర్ పోలీసులు కేసునమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

మోస్తరు వర్షానికే వాలిపోయిన వరి పైరు







గూడలి వద్ద వాలిపోయిన వరి పంట, దక్షిణపాలం వద్ద పూర్తిగా నీటిలో పడిపోయిన వరి, సూళ్లూరుపేట గాండ్లవీధిలో నిలిచిన వర్షపు నీరు

కోట, ఆగస్టు 4: మండలంలో రెండురోజులుగా రాత్రి కురుస్తున్న మోస్తరు వర్షానికి వరిపైర్లు పూర్తిగా వాలిపోవడంతో రైతులు లబోదిబోమంటున్నారు. ప్రధానంగా గూడలి, దక్షిణపాలం, వెంకన్నపాళెం, తిమ్మానాయుడుపాళెం, రుద్రవరం గ్రామాల్లో రైతులు ఎక్కువగా 1010 రకం వరి సాగు చేశారు. అయితే ఎడగారుసాగు కింద చేపట్టిన ఈ పంట మొదట్లో చెదురుమదురుగా కురిసిన వర్షాకు పంటలకు ఊపిరిపోసినట్లు అయింది. అయితే ప్రస్తుతం ఆయా పంటలన్నీ వెన్ను, చిరుపొట్టదశలో ఉన్నాయి. పంటల దిగుబడి ఎక్కువగా వస్తుంది అనుకున్న నేపథ్యంలో ప్రస్తుతం కురుస్తున్న వర్షం రైతుల ఆశలపై నీళ్లుచల్లినట్లయింది. దాదాపుగా వెన్నుదశలో ఉన్న పైర్లు అన్ని వాలిపోవడంతో పంటంతా పాచిపోయి పనికిరాకుండా పోతాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చెదురు మదురుగా వర్షం పడుతూనే ఉంటే ధాన్యం మొలకెత్తే ప్రమాదం ఉంది.

సూళ్లూరుపేటలో వర్షం

సూళ్లూరుపేట : సూళ్లూరుపేట పట్టణంలో ఆదివారం సాయంత్రం ఉరుములు, మెరుపులతో కూడిన భారీవర్షం కురిసింది. ఉదయం నుంచి ఉక్కపోతతో అల్లాడిపోయిన పట్టణవాసులకు సాయంత్రం గంటసేపు వర్షం పడడంతో కాస్త ఉపశమనం కలిగింది. గాండ్లవీధి, సాయినగర్, జీఎన్‌టీ రోడ్డు, రైల్వేస్టేషన్ రోడ్డు, షార్ బస్టాండు సమీపంలో రోడ్డుపై వర్షపునీరు చేరి పాదచారులు, వాహన చోదకులు ఇబ్బందులుపడ్డారు. పొట్ట దశలో ఉన్న వరి పంటకు కూడా ఈ వర్షంతో ఎంతో మేలు చేకూరిందని రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ప్రతి హామీ నెరవేర్చేదిశగా చంద్రబాబు అడుగులు

సూళ్లూరుపేట ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ

తడ, ఆగస్టు 4 : ఎన్నికల్లో టీడీపీ ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చేదిశగా సీఎం చంద్రబాబు అడుగులు వేస్తున్నారని ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ అన్నారు. ఆదివారం తడలో టీడీపీ విజయాన్ని పురస్కరించుకొని విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. స్థానిక పార్టీ కార్యాలయం నుంచి బజారువీధుల్లో ర్యాలీ జరిగింది. అనంతరం జరిగిన సభలో ఎమ్మెల్యే మాట్లాడుతూ చంద్రబాబు పింఛను రూ.4వేలుగా చేసి ఏప్రిల్ నుంచి ఆ పెంచిన పింఛన్‌ను అందజేసిన ఘనత చంద్రబాబుదే అన్నారు. కొద్దిరోజుల్లోనే సూపర్ సిక్స్‌లోని మిగిలిన పథకాలన్నీ అమలు చేసేందుకు అహర్నిశలు కృషి చేస్తున్నారన్నారు. ఈనెల 15వ తేదీన అన్న క్యాంటీన్లు ప్రారంభమవుతున్నాయని, సూళ్లూరుపేట, నాయుడుపేటల్లో వీటిని ఏర్పాటు చేస్తున్నామన్నారు. పులికాట్ ముఖద్వారాలను తెరిపించి మత్స్యకారులను ఆదుకుంటామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఎమ్మెల్యేతోపాటు మండల అధ్యక్షుడు మురళీరెడ్డి, నీలకంఠం, రవి, రాజారెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, శివాజీ, సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

ఫ్లెక్సీపై వివాదం

విజయోత్సవ సభ, ర్యాలీ సందర్భంగా టీడీపీ నాయకులు ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలు వివాదానికి దారితీశాయి. కొన్ని ఫ్లెక్సీలలో ప్రముఖ పారిశ్రామికవేత్త కొండేపాటి గంగాప్రసాద్ ఫొటోను ముద్రించకపోవడంతో ఆయన వర్గం నాయకులు భగ్గుమన్నారు. ఆదివారం ఉదయమే కొండేపాటి వర్గం నాయకులు సెల్వం, బొమ్మన పళణి, సుదర్శన్, టీకె శ్రీనివాసన్ తదితరులు సూళ్లూరుపేటలోని ఎమ్మెల్యే నివాసానికి వెళ్లి అక్కడ తమ అసమ్మతిని తెలియజేశారు. నెలవల సుబ్రహ్మణ్యం కల్పించుకుని సర్దిచెప్పారు. అయితే కొండేపాటి వర్గం నాయకులు



విజయోత్సవ సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ

మాత్రం ఈ కార్యక్రమానికి హాజరుకాలేదు. కొంత కాలంగా వర్గాలుగా విడిపోయి ఎన్నికల సమయంలో కలసి పనిచేసినట్లుగా కన్పించినా ఆ తరువాత ఎవరికి వారే గ్రూపు రాజకీయాలు కొనసాగిస్తున్నారు.

ఎమ్మెల్యే విజయశ్రీకి సన్మానం

సూళ్లూరుపేట : ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆదివారం తడ మండల టీడీపీ నాయకులు బొమ్మన పళణి, సుదర్శనరావు ఆధ్వర్యంలో ఎమ్మెల్యే విజయశ్రీ, మాజీ ఎమ్మెల్యే నెలవల సుబ్రమణ్యం, టీడీపీ అధికార ప్రతినిధి తిరుమూరు సుధాకర్ రెడ్డిని సన్మానించారు. తడ మండల అభివృద్ధికి నిధులు వచ్చేలా కృషి చేయాలని ఎమ్మెల్యేను కోరారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు టీకే శ్రీనివాసన్, రవి, జయపాల్, భాస్కర్, దేశప్పపరుమన్, నరసింహ, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

రూ.12 కోట్లతో మౌలిక వసతులు : నెలవల

సూళ్లూరుపేట, ఆగస్టు 4: సూళ్లూరుపేట నియోజకవర్గంలో రూ.12 కోట్లతో మౌలిక వసతులు కల్పించనున్నట్లు మాజీ ఎంపీ నెలవల సుబ్రమణ్యం అన్నారు. ఆదివారం ఆయన టీడీపీ నాయకులతో కలిసి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ నియోజకవర్గంలో ఉన్న 6 మండలాల్లో ప్రతి మండలానికి రూ.2 కోట్ల చొప్పున సీసీ రోడ్లు, డ్రైన్ నిర్మాణాలకు ప్రభుత్వం రూ.12 కోట్లు నిధులు మంజూరు చేసిందన్నారు. ఆ నిధులతో గ్రామాల్లో అవసరమైన చోట సీసీ రోడ్లు, డ్రైన్లతో పాటు మౌలిక వసతులు కల్పించనున్నట్లు తెలిపారు. 2014 నుంచి 2019 వరకు టీడీపీ ప్రభుత్వ హయాంలో రూ.24 కోట్లతో గ్రామాల్లో సీసీ రోడ్లు నిర్మించి అభివృద్ధికి బాటవేశారన్నారు. వైసీపీ హయాంలో 2019 నుంచి 2024 వరకు గ్రామాల్లో కనీసం కిలో మీటరు సీసీ రోడ్డు కూడా వేయలేదని విమర్శించారు. మళ్లీ చంద్రబాబు హయాంలో ఎస్ఆర్ఏసీ నిధులతో గ్రామాల్లో అవసరమైన చోట్ల సీసీ రోడ్ల నిర్మాణానికి ముఖ్యమంత్రి ప్రత్యేక శ్రద్ధ తీసుకొన్నట్లు తెలిపారు.కార్యక్రమంలో టీడీపీ పట్టణ



మాట్లాడుతున్న మాజీ ఎంపీ నెలవల, టీడీపీ నాయకులు

అధ్యక్షుడు ఆకుతోట రమేష్, టీడీపీ నాయకులు వాసం రెడ్డి సుధాకర్ రెడ్డి, నాగేందర్ రెడ్డి, టీకే శ్రీనివాసన్, మీజూరు వెంకటేశ్వర్లు రెడ్డి, రమణయ్య, శశిధర్, ఆలీబాయ్, వెంకటేశ్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

టీటీడీ డిప్యూటీఈవోగా వెంకటేశ్వరరావు

తిరుమల, ఆగస్టు 4 (ఆంధ్ర జ్యోతి): గుంటూరు మెప్మా ఎండీగా పనిచేస్తున్న డిప్యూటీ కలెక్టర్ వెంకటేశ్వరరావు టీటీడీ డిప్యూటీ ఈవోగా నియమితులయ్యారు. కూటమి ప్రభుత్వం ఏర్పాటైన క్రమంలో టీటీడీలో భారీగా బదిలీలు జరుగుతున్న విషయం తెలిసిందే. ఈక్రమంలో డిప్యూటీ కలెక్టర్‌గా ఉన్న వెంకటేశ్వరరావును టీటీడీ డిప్యూటీఈవోగా నియమిస్తూ ఏపీ సీఎస్ నీరబ్‌కుమార్ మిశ్రా ఆదివారం ఉత్తర్వులు జారీ చేశారు.


హౌసింగ్‌లో అవినీతి నిగ్గు తేల్చాలి

తిరుపతి(నేరవిభాగం), ఆగస్టు 4: గత వైసీపీ ప్రభుత్వ హయంలో జరిగిన హౌసింగ్ కుంభకోణంపై విచారణ జరపాలని తెలుగు యువత తిరుపతి పార్లమెంటు అధికార ప్రతినిధి గుత్తా శరత్ కలసి విజ్ఞప్తి చేశారు. రాష్ట్ర గృహనిర్మాణ శాఖా మంత్రి పార్థసారథిని ఆదివారం అలిపిరి వద్ద టౌన్ బ్యాంకు మాజీ చైర్మన్ పులుగోరు మురళీకృష్ణారెడ్డి ఆధ్వర్యంలో గుత్తా శరత్ మంత్రిని కలసి శాలువా కప్పి వినతి పత్రం అందచేశారు. పులుగోరు మురళీకృష్ణారెడ్డి, గుత్తా శరత్‌లు మాట్లాడుతూ జిల్లాలో జగనన్నకాలనీల్లో భారీ ఎత్తున అవినీతి జరిగిందన్నారు. ఇందులో కొందరు ప్రజా ప్రతినిధుల పాత్ర ఉందన్నారు. నామినేటెడ్ పదవుల్లో యువతకు ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు. యువతపై నమోదైన కేసులు రద్దు చేసి న్యాయం చేయాలని కోరారు. మంత్రి సానుకూలంగా స్పందించినట్లు శరత్ చెప్పారు.

ప్రైవేట్ అంబులెన్స్‌ల అక్రమాలు అరికట్టండి

తిరుపతి(ఉపాధ్యాయనగర్), ఆగస్టు 4: తిరుపతిలోని ఆసుపత్రుల వద్ద ప్రైవేట్ అంబులెన్స్‌ల అక్రమాలను అరికట్టాలని రాష్ట్ర వైద్య ఆరోగ్య మంత్రి సత్యకుమార్‌కు బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి సామంచి శ్రీనివాస్ విజ్ఞప్తి చేశారు. విజయవాడలో ఆదివారం మంత్రిని కలిసిన ఆయన ఆ మేరకు వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ...తిరుపతి పెద్ద వైద్య కేంద్రం కావడంతో పొరుగు జిల్లాల నుంచి వేలాది మంది రోగులు తిరుపతికి వస్తుంటారన్నారు. మృతదేహాలను స్వస్థలాలకు తీసుకెళ్లేందుకు గతంలో టీడీపీ ప్రభుత్వం మహా ప్రస్థానం పేరిట వాహనాలను ఏర్పాటుచేసిందన్నారు. ఐదేళ్లుగా మహా ప్రస్థానం డ్రైవర్లు మృతుల కుటుంబీకుల నుంచి డబ్బు గుంజుతున్నారన్నారు. రుయా, స్విమ్స్, మెటర్నిటీ, చిన్నపిల్లల ఆసుపత్రుల వద్ద అంబులెన్స్ డ్రైవర్లు రింగ్‌గా ఏర్పడి అడిగినంత ఇస్తేగాని అంబులెన్స్ సేవలు అందించడం లేదన్నారు. వీరి ఆగడాలు అరికట్టేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు.

పార్థివ శివలింగాలకు ప్రత్యేక పూజలు



తిరుపతి అర్బన్, ఆగస్టు 4: స్థానిక తిరుమల బైపాస్ రోడ్డులోని శ్రీవారి సన్నిధిలో పార్థివ శివలింగాలకు మాజీ మంత్రి టీజీ వెంకటేశ్ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కాశీలో నవంబరు 4నుంచి 11వరకు సద్గురు సామవేదం షణ్ముఖశర్మ పలు క్రతువులు నిర్వహించనున్న నేపథ్యంలో తిరుపతికి చెందిన సేవా కుటుంబ చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో దాదాపు రెండు లక్షల పార్థివ శివలింగాలను తయారు చేశారు. ఈ సందర్భంగా టీజీ వెంకటేశ్ ఆదివారం ఉదయం శివలింగాలకు ప్రత్యేక పూజలు నిర్వహించి కాశీకి తరలింపు ఏర్పాట్లు చేశారు. కార్యక్రమంలో టీటీడీ బోర్డు మాజీ సభ్యులు ముద్రంశెట్టి రాములు, ట్రస్టు ప్రతినిధులు మద్దుల సరళరాజ్‌కుమార్, శ్రీదేవి, సాయి, చందు, రాజమనోహర్ తదితరులు పాల్గొన్నారు.

అఖిలభారత యువజన మహాసభ సంఘం రాష్ట్ర అధ్యక్షుడిగా శంకర్‌యాదవ్

తిరుపతి అర్బన్, ఆగస్టు 4: ఆలిండియా యువజన మహాసభ సంఘం రాష్ట్ర అధ్యక్షుడిగా తిరుపతికి చెందిన శంకర్‌యాదవ్ నియమితులయ్యారు. ఆదివారం న్యూఢిల్లీలో సంఘం జాతీయ మహాసభ సమావేశం జరిగింది. ఆ సంఘం జాతీయ అధ్యక్షుడు మహేష్‌యాదవ్, ఉపాధ్యక్షుడు అన్నా రామచంద్రయాదవ్, ప్రధాన కార్యదర్శి నత్తు నరేంద్రయాదవ్, రాష్ట్ర అధ్యక్షుడు వెంగళరావు చేతుల మీదుగా శంకర్‌యాదవ్ నియామక పత్రాన్ని అందుకున్నారు.

శ్రీవారి హుండీ ఆదాయం రూ.3.76 కోట్లు

తిరుమల, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): తిరుమల వేంకటేశ్వరస్వామి హుండీ ఆదాయం రూ.3.76 కోట్లు లభించింది. శుక్రవారం ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులు సమర్పించిన హుండీ కానుకలను టీటీడీ శనివారం లెక్కించి, ఆదివారం ఉదయం ప్రకటించింది. శనివారం 75,140 మంది భక్తులు శ్రీవారిని దర్శించుకోగా, 28,256 మంది తలనీలాలు సమర్పించారు.

వెంకన్న సేవలో ప్రముఖులు



తిరుమల, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారిని ఆదివారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. వారిలో.. మంత్రి కొండపల్లి శ్రీనివాస్, ఎమ్మెల్యే దగ్గుబాటి వెంకటేశ్వరప్రసాద్ ఉన్నారు. వీరికి ఆలయ అధికారులు ప్రత్యేక దర్శనం కల్పించి, లడ్డూప్రసాదాలు అందజేశారు. దర్శనం అనంతరం మంత్రి శ్రీనివాస్ మీడియాతో మాట్లాడుతూ.. రాష్ట్రాన్ని ముందుకు తీసుకెళ్లేందుకు ప్రజలందరూ ఎన్డీయే కూటమిని గెలిపించారన్నారు. ప్రజలు సంతోషంగా ఉండాలని శ్రీవారిని ప్రార్థించనన్నారు.

అప్పుల బాధతో వ్యక్తి ఆత్మహత్య

తిరుపతి(నేరవిభాగం), ఆగస్టు 4: అప్పుల బాధ తాళలేక ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. అలిపిరి ఇన్‌చార్జి సీఐ జయనాయక్ కథనం మేరకు.. కాంచీపురానికి చెందిన సంపత్‌కుమార్(50) సెకండ్ హ్యాండ్ వాహనాలను కొనుగోలు చేసి విక్రయించేవాడు. ఈనెల 2న అలిపిరి పోలీసు స్టేషన్ పరిధిలోని లాడ్జిలో రూము అద్దెకు తీసుకున్నాడు. రెండు రోజులుగా అతను బయటకు రాకపోవడంతో లాడ్జి సిబ్బంది తలుపులు పగులకొట్టి చూశారు. గదిలో మృతి చెందినట్లు గుర్తించారు. పోలీసులకు సమాచారమిచ్చారు. వారు మృతదేహాన్ని రుయాకు తరలించారు. మృతుని బంధువులకు సమాచారం అందించారు. అప్పుల పాలు కావడంతో జీవితంపై విరక్తి చెంది విషం తాగి ఆత్మహత్య చేసుకుని ఉంటాడని పోలీసులు భావిస్తున్నారు.

తక్షణమే బీసీ కులగణన చేపట్టాలి

తిరుపతిరూరల్, ఆగస్టు4: ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీ ప్రకారం సమగ్ర బీసీ కులగణన చేపట్టాలని ఏపీ బీసీ విద్యార్థి విభాగం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ నాగేశ్వరరావు పేర్కొన్నారు. విజయవాడలో టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావును ఆయన ఆదివారం మర్యాదపూర్వకంగా కలసి వినతి సమర్పించారు. బీసీ హాస్టల్స్‌కి శాశ్వత భవన నిర్మాణాలు, ఇంటర్, డిగ్రీ, పీజీ, పీహెచ్‌డీ కోర్సుల బీసీ విద్యార్థులకు ప్రస్తుత ధరలకు అనుగుణంగా ఉపకార వేతనాలు, స్టైఫండ్ పెంపు, ప్రభుత్వ ఉద్యోగాలలో(ఔట్‌సోర్సింగ్, టైమ్‌స్కేల్, కాంట్రాక్ట్)రూల్ ఆఫ్ రిజర్వేషన్ అమలు, నామినేటెడ్ పోస్టుల్లో సామాజిక న్యాయం తదితర అంశాలను వినతిపత్రంలో ప్రస్తావించినట్లు ఆయన తెలిపారు.

ఉపాధ్యాయులను ఆదాయపన్ను నుంచి మినహాయించండి

తిరుపతి(విద్య), ఆగస్టు 4: ఉపాధ్యాయులను ఆదాయపన్ను నుంచి వినహాయించాలని ఆపస్ నేతలు కేంద్రమంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మను కోరారు. ఆదివారం తిరుపతిలో ఆయనను ఆపస్ నేతలు బాలాజీ, సాంబిరెడ్డి, దేవరాజులు కలిసి ఈ మేరకు విజ్ఞాపన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... పాత పెన్షన్ విధానాన్ని అమలు చేసేందుకు కృషి చేయాలన్నారు. ఏకీకృత సర్వీసు రూల్స్ అమలులో ఉన్న ఇబ్బందులను తొలగించి అన్ని కేడర్ల ప్రమోషన్లకు మార్గం సుగమం చేయాలని విజ్ఞప్తి చేశారు. కేంద్ర ప్రభుత్వ జీడీపీలో 10 శాతం, రాష్ట్ర ప్రభుత్వ జీడీపీలో 30 శాతం విద్యపై ఖర్చు చేసేందుకు కృషి చేయాలని ఆయనను కోరారు. ఆపస్ నాయకులు దాము, రాఘవ తదితరులు పాల్గొన్నారు.